
# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 63, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం -21 - మే - 2025


## ఇండియాలో పెరుగుతున్న కరోనా జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!



పెరుగుతున్న కరోనా కేసులతో భారత్ లో ఆందోళన

నిన్నటికి దేశ వ్యాప్తంగా 257 యాక్టివ్ కేసులు

కొత్త వేరియంట్ కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఉందంటున్న నిపుణులు

## న్యాయమూర్తులూ మనుషులే.. పొరపాట్లు జరుగుతాయన్న జస్టిస్ అభయ్ ఓకా



గృహ హింస చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు హైకోర్టులకు మార్గదర్శనం

ఓ కేసులో తాను పొరపాటు చేసినట్లు అంగీకరించిన సుప్రీం జడ్జి

న్యాయమూర్తులకు అభ్యాసం అనేది నిరంతర ప్రక్రియ అని వ్యాఖ్య

## బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది

– అసోం సీఎం సంచలన వ్యాఖ్యలు



అపార ఖనిజ సంపద ఉన్నా అభివృద్ధి శూన్యమన్న హిమంత

దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని వెల్లడి

మౌలిక వసతులు కూడా కరవయ్యాయని ఆవేదన

పాలకుల నిర్లక్ష్యమే కారణమని హిమంత విశ్లేషణ

# రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

- రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం, అంతర్గత భద్రతకు ముప్పు: పవన్
- వారికి ఆధార్, ఓటరు, రేషన్ కార్డుల జారీపై తీవ్ర ఆందోళన
- కొందరు అధికారుల సాయంతోనే రోహింగ్యాలు స్థిరపడుతున్నారని పవన్ అనుమానం
- గతంలో బెంగాల్ నుంచి ఏపీకి భారీగా వలస వచ్చిన వైనం
- ఈ అంశంపై పోలీసులకు లేఖ రాశానని వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి




**అమరావతి,:** రోహింగ్యాల అక్రమ వలసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీవ్రతరం చేయడమే కాకుండా, దేశ అంతర్గత భద్రతకు కూడా పెను ప్రమాదంగా పరిణమిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ప్రభుత్వ యంత్రాంగంలోని వ్యక్తుల సహకారంతోనే రోహింగ్యాలు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని, వారికి సులభంగా ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు కూడా అందుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. గన్నవరం ఎయిర్ పోర్టులో పవన్ కల్యాణ్ ఇవాళ జాతీయ మీడియాతో మాట్లాడారు. గతంలో, ముఖ్యంగా 2017-18 సంవత్సరాల మధ్యకాలంలో, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నుంచి పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు బంగారం పని నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వలస వచ్చారని మిగతా..2లో

# పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

మరోసారి వార్నింగ్ ఇచ్చిన జగన్

కూటమి ప్రభుత్వం, అధికారులకు జగన్ తీవ్ర హెచ్చరిక

అన్యాయాలు చేస్తే ఎవరినీ వదిలేది లేదని వార్నింగ్

రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని విమర్శ



**అమరావతి,:** వైసీపీ అధినేత జగన్ మరోసారి కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్యాయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా "సినిమా చూపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

# ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన ..

## అధికారుల గుండెల్లో గుబులు

- జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తానని పేర్కొన్న సీఎం చంద్రబాబు
- ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందేనని వెల్లడి
- ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలని సూచన



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుతున్న రేషన్, దీపం, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎంవో కార్యదర్శులతో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని, అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సీఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని మిగతా..2లో

## వంశీ, నాని కర్మ అనుభవిస్తున్నారు కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు



- భువనేశ్వరిని తిట్టడంలో జగన్ ప్రోత్సాహం ఉందన్న ఎమ్మెల్యే
- జగన్‌ను అరెస్ట్ చేసినా సానుభూతి రాదన్న కోటంరెడ్డి
- అమరావతి రైతులపై దాడి చేయాలని సజ్జల సూచించారన్న కోటంరెడ్డి
- వైసీపీలో బూతులకు ప్రోత్సాహం

## జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక ..




సీఎస్ విజయానంద్ కీలక సూచనలు

- విశాఖలో పీఎం మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 5 లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొంటారన్న సీఎస్ విజయానంద్
- రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో కీలక సూచనలు జారీ

**అమరావతి,:** జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో మిగతా..2లో

## పోలీసులు విఫలమైతే నేనే రంగంలోకి దిగుతా: కేఏ పాల్



తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థి కిడ్నాప్, చిత్రహింసలకు గురయ్యాడని ఆరోపణ

రాష్ట్రంలో అన్యాయం, అక్రమ రవాణా, హింస రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన

పోలీసులు చర్యలు తీసుకోకుంటే తానే రంగంలోకి దిగుతానని స్పష్టం

మే 24న గ్లోబల్ పీస్ అసెంబ్లీకి హాజరుకావాలని ప్రజలకు పిలుపు

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించాలని

# 5 లక్షల మందికి 'యువవికాసం'

జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ

నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చుచేయనున్న ప్రభుత్వం

3 నెలల్లో యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యం




హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకం కింద తొలిఏడాది 5 లక్షల మందికి మంజూరుపత్రాలు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేయాలని, 3 నెలల్లో నెలకు రూ.2 వేల కోట్లు చొప్పున ఖర్చుచేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని భావిస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 నాటికి జిల్లా మంత్రుల అనుమతితో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసేందుకు సంక్షేమశాఖలు సిద్ధమయ్యాయి. మిగతా..2లో




**కార్పొరేషన్లవారీగా లక్ష్యాలు.. దరఖాస్తులు**

| కార్పొరేషన్ | యూనిట్ల లక్ష్యం | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| ఎస్సీ | 1.44 లక్షలు | 3.92 లక్షలు |
| ఎస్టీ | 91 వేలు | 1.83 లక్షలు |
| బీసీ | 1.55 లక్షలు | 8.01 లక్షలు |
| ఈబీసీ | 51 వేలు | 37 వేలు |
| మైనార్టీ | 45 వేలు | 2.04 లక్షలు |
| క్రిస్టియన్ మైనార్టీ | 5 వేలు | 4,600 |

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!



- నోటీసులు జారీ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు
- నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు
- కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్‌తో పాటు, ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్ రావు, బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది. కేసీఆర్ జూన్ 5వ మిగతా..2లో

# న్యాయమూర్తులూ మనుషులే..
# పొరపాట్లు జరుగుతాయన్న జస్టిస్ అభయ్ ఓకా

న్యూఢిల్లీ: న్యాయమూర్తులు కూడా మనుషులేనని, తీర్పులు వెలువరించే క్రమంలో వారు పొరపాట్లు చేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్. ఓకా అభిప్రాయపడ్డారు. 2016లో తాను బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు గృహ హింస చట్టం (డీవీ యాక్ట్) వ్యాఖ్యానానికి సంబంధించిన ఒక కేసులో పొరపాటు చేశానని ఆయన అంగీకరించారు. న్యాయమూర్తులకు ఇది నిరంతర అభ్యాస ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. గృహ హింస చట్టంలోని సెక్షన్ 12(1) కింద దాఖలైన దరఖాస్తుల విచారణను రద్దు చేసే అధికారం సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద హైకోర్టులకు ఉందని జస్టిస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఓ తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా జస్టిస్ ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తిగా గతంలో తాను దీనికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశానని జస్టిస్ ఓకా గుర్తు చేసుకున్నారు. "2016 అక్టోబర్ 27న బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పులో నేను కూడా భాగస్వామినే. డీవీ యాక్ట్, 2005లోని సెక్షన్ 12(1) కింద చేసిన దరఖాస్తును రద్దు చేయడానికి వీలులేదని ఆ తీర్పులో పేర్కొన్నాం. ఈ అభిప్రాయం తప్పని అదే హైకోర్టు ఫుల్ బెంచ్ ద్వారా తేలింది. న్యాయమూర్తులుగా మా తప్పులను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మాపైనే ఉంది. న్యాయమూర్తులకు కూడా నిరంతర అభ్యాస ప్రక్రియ అవసరం" అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. గృహ హింస చట్టం మహిళల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టమని జస్టిస్ ఓకా చెప్పారు. గృహ హింసకు గురైన మహిళలకు న్యాయం చేసేందుకే ఇది ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. సెక్షన్ 482 ద్వారా సంక్రమించిన అధికారంతో ఇలాంటి దరఖాస్తులను రద్దు చేసేటప్పుడు హైకోర్టులు ఆచితూచి వ్యవహరించాలని ధర్మాసనం సూచించింది. కేసులో తీవ్రమైన చట్టవిరుద్ధత లేదా న్యాయ ప్రక్రియ దుర్వినియోగం జరిగిందని స్పష్టంగా తేలినప్పుడు మాత్రమే జోక్యం చేసుకోవాలని పేర్కొంది. ఈ విషయంలో హైకోర్టులు సంయమనం పాటించకపోతే గృహ హింస చట్టం 2005 ఉద్దేశమే దెబ్బతింటుందని ధర్మాసనం హెచ్చరించింది.

# బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ దోచుకుంటోంది
### – అసోం సీఎం సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో నెలకొన్న పరిస్థితులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. అపారమైన సహజ వనరులు, ఖనిజ సంపద ఉన్నప్పటికీ పాకిస్థాన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన అన్నారు. దశాబ్దాలుగా బలూచిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా దోపిడీకి గురవుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం హిమంత తన 'ఎక్స్' ఖాతా ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. "బలూచిస్థాన్ ప్రావిన్స్ అపారమైన ఖనిజ సంపదకు నిలయం. అయినా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ రాజ్యమేలుతోంది" అని హిమంత తన పోస్టులో పేర్కొన్నారు. పాకిస్థాన్ మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికి పైగా బలూచిస్థాన్‌లోనే ఉన్నప్పటికీ, అక్కడి ప్రభుత్వం ఆ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. "ఆ ప్రాంతంలో భారీగా రాగి, బంగారు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంకా వెలికితీయని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజాలు, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి నిల్వలు బలూచిస్థాన్‌లో ఉన్నాయి" అని హిమంత వివరించారు. బలూచిస్థాన్‌లోని సుయ్ ప్రాంతంలో 1952లోనే గ్యాస్ నిక్షేపాలను కనుగొన్నారని, 2020 నాటికి పాకిస్థాన్ దేశానికి అవసరమైన సహజ వాయువులో దాదాపు 56 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోందని హిమంత బిశ్వ శర్మ గుర్తు చేశారు. గ్వాదర్ ఓడరేవు, 770 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్నా, ఆ ప్రాంత ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో కూడా బలూచిస్థాన్ ప్రావిన్స్ వాటా చాలా తక్కువగా ఉందని ముఖ్యమంత్రి హిమంత అన్నారు. అపారమైన వనరులున్న ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ, అక్కడి ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని ఆయన తెలిపారు. "బలూచిస్థాన్‌లో వనరులకు కొరత లేదు. కానీ పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ దోపిడీ విపరీతంగా ఉంది" అని హిమంత ఆరోపించారు.

### వంశీ, నాని కర్మ అనుభవిస్తున్నారు
# కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు

అమరావతి,: మాజీ మంత్రులు వల్లభనేని వంశీ, కొడాలి నాని ప్రస్తుతం వారు చేసిన వ్యాఖ్యలకు మూల్యం చెల్లించుకుంటున్నారని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని లిక్కర్ స్కామ్ లేదా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తే ప్రజల నుంచి సానుభూతి వస్తుందనేది అవాస్తవమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వారిద్దరి విషయంలో తనకు ఎలాంటి సానుభూతి లేదని, దేవుడి స్క్రిప్ట్ ప్రకారం అంతా జరుగుతోందని ఆయన అన్నారు. జగన్ ప్రోత్సాహంతోనే ఆనాడు కొందరు నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని, అలాంటి సంస్కృతి టీడీపీలో లేదని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందిన ధనుంజయ రెడ్డిని లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ చేసిన నేపథ్యంలో, తదుపరి అరెస్ట్ జగన్‌దేనని ప్రచారం జరుగుతోందని కోటంరెడ్డి ప్రస్తావించారు. ఒకవేళ జగన్‌ను అరెస్ట్ చేసినా, లేదా పాత అక్రమాస్తుల కేసులో బెయిల్ రద్దయినా ఆయనకు సానుభూతి వస్తుందని తాను అనుకోవడం లేదని తెలిపారు. "అత్యంత నిజాయితీపరుడిగా పేరుపొందిన అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణం కేసులో జైల్లో పెట్టారు. జైలు నుంచి వచ్చాక ఎన్నికలు జరిగితే ఆమ్ ఆద్మీ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. 2014కు ముందు జగన్ జైల్లో ఉన్నా అధికారం రాలేదు కదా?" అని కోటంరెడ్డి గుర్తుచేశారు. కాబట్టి, కేసుల్లో జగన్ పాత్ర ఉందని విచారణ అధికారులు భావిస్తే చర్యలు తీసుకుంటారని, అరెస్టుల వల్ల వైసీపీకి సానుభూతి వస్తుందనడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రులు కొడాలి నాని, వల్లభనేని వంశీల ప్రస్తుత పరిస్థితిపై కోటంరెడ్డి ఘాటుగా స్పందించారు. "రెడ్ బుక్‌లో పేరుందనగానే కొడాలి నానికి గుండె నొప్పి వచ్చింది, బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఇక, నారా భువనేశ్వరి గారిని ఉద్దేశించి వంశీ చేసిన దారుణమైన వ్యాఖ్యలకు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని, 20 కేజీలు బరువు తగ్గి నరకం అనుభవిస్తున్నారు. అధికారం ఉందని సభ్యసమాజంలో ఎవరూ మాట్లాడలేని మాటల్ని శాసనసభలో మాట్లాడిన వారిపై నాకే కాదు, తెలుగు ప్రజలెవరికీ సానుభూతి ఉండదు. ఇది దేవుడి స్క్రిప్ట్. ధర్మాన్ని మరిచి ప్రవర్తిస్తే అది మన మెడకే చుట్టుకుంటుంది" అని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే నష్టం జరిగిందని, పరోక్షంగా టీడీపీకి మంచి చేసిందని ఆయన అన్నారు. "నాలాంటి ఆవేశం ఎక్కువ ఉన్న వాడుంటే పరిస్థితి వేరేగా ఉండేది. చంద్రబాబు నాయుడు గారు పెద్ద మనిషి కాబట్టి, చట్టప్రకారం జరగాలని ఆలోచించారు కాబట్టి ఆలస్యమైంది" అని కోటంరెడ్డి తెలిపారు. వంశీ, నాని మాట్లాడిన మాటలు వాళ్లవి కావని, జగన్మోహన్ రెడ్డి మాట్లాడించిన మాటలని కోటంరెడ్డి ఆరోపించారు. "జగన్ గారు అలాంటి మాటలు మాట్లాడితేనే ప్రోత్సహిస్తారు, భుజం తడతారు. ప్రత్యర్థుల మీద, మీడియా మీద హద్దు మీరి మాట్లాడితే బాగా ప్రోత్సహిస్తారు. జోగి రమేష్ శాసనసభలో ఏబీఎన్ రాధాకృష్ణ గారి గురించి, రామోజీరావు గారి గురించి ఎలా మాట్లాడారో, చంద్రబాబు గారి ఇంటిపై దాడికి ఎలా యత్నించారో అందరికీ తెలుసు. అధినేత ఖండించకపోగా మంత్రి పదవి ఇచ్చారు. కాబట్టి ఇవన్నీ జగన్ గారి మాటలుగానే భావించాలి" అని శ్రీధర్ రెడ్డి అన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి ఇలా తిట్టమని స్క్రిప్ట్ పంపేవారని, తిట్టకపోతే పార్టీలో భవిష్యత్తు ఉండదని కొందరు నేతలు చెప్పినట్లు కోటంరెడ్డి వెల్లడించారు. "నువ్వు హుందాగా మాట్లాడితే కుదరదు, అడ్డగోలుగా మాట్లాడాలి, తిట్టాలి అని సజ్జల గారు నాతో అన్నారు. అమరావతి రైతులు వరదల్లో చిక్కుకుంటే మానవత్వంతో పరామర్శిస్తే, 'వాళ్లని పరామర్శించడం తప్పు, వాళ్ల మీద దాడి చేసి ఉంటే జగన్ గారు మెచ్చుకునేవారు' అని సజ్జల గారు స్వయంగా నాతో చెప్పారు" అని కోటంరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అమరావతి ప్రజలు పాదయాత్రగా వెళ్తుంటే సర్వేపల్లి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో దాడులు జరిగాయని, ఫ్లెక్సీలు చించేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం తాను టీడీపీ శాసనసభ్యుడినని, కష్టకాలంలో చంద్రబాబు, లోకేశ్ తనకు అండగా నిలిచి, టికెట్ ఇచ్చి ప్రోత్సహించారని కోటంరెడ్డి తెలిపారు. "ఈరోజు కూడా జగన్ గారి గురించి, వైసీపీ గురించి మాట్లాడాల్సిన పరిస్థితుల్లో మాట్లాడతాను. హుందా అయిన భాషతో, పద్ధతైన భాషతో, ప్రజల్ని ఒప్పించే, మెప్పించే భాషతో మాట్లాడతాను. బూతులు తిట్టడం నా వల్ల కాదు. టీడీపీలో అలా మాట్లాడమని చెప్పరు, మాట్లాడితే ఊరుకోరు. ఎవరైనా తప్పుగా మాట్లాడితే వెంటనే టీడీపీ స్టేట్ ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుంది" అని కోటంరెడ్డి స్పష్టం చేశారు.

# జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక

మొదటి పేజి తరువాయి

5 లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకూ జరిగే యోగా దినోత్సవ కార్యక్రమంలో కనీసం 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకు నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో కనీసం 2 కోట్ల మంది భాగస్వాములయ్యేలా చూడాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు కృషి చేయాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సర్క్యులర్ ఆదేశాలు, జీవోలను జారీ చేయడం జరుగుతుందని సీఎస్ విజయానంద్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ నోడల్ అధికారి యం.టి కృష్ణబాబు ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "Yoga for One Earth, One Health" అనే నినాదంతో యోగాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈనెల 21 నుండి జూన్ 21 వరకూ నెల రోజులపాటు ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరిట ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మూడు దశలుగా చేపట్టనున్నట్టు అనగా ఈనెల 21 నుండి 27 వరకూ ప్రాథమిక దశ కింద ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ, 28 నుండి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4 నుండి 16 వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈనెల 21న అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి కనీసం 10 వేల మంది ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, పిఇటిలు, యోగా అభ్యాసకులు తదితరులతో కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో సమావేశమై వారి భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని చెప్పారు. జూన్ 21న రాష్ట్ర వ్యాప్తంగా 100 పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, పీఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఐఅండ్ఐ శాఖ కార్యదర్శి డా.ఎన్. యువరాజ్, న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొన్నారు.

# ఇండియాలో పెరుగుతున్న కరోనా
# జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మే 19 నాటికి దేశవ్యాప్తంగా 257 యాక్టివ్ కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాధి వ్యాప్తి తీరుతెన్నులపై నిశితంగా దృష్టి సారించారు. ఇప్పటికే హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతుండటం గమనార్హం. ప్రస్తుతం మన దేశంలో కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. అయితే, హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ విజృంభణకు ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 అనే కరోనా వేరియంట్లు కారణమని నిపుణులు తేల్చారు. ఈ రెండు వేరియంట్లు కూడా జేఎన్.1 అనే మరో కొత్త వేరియంట్ నుంచి ఉద్భవించినవే కావడం గమనార్హం.

జేఎన్.1 వేరియంట్ అంటే ఏమిటి?

ఒమిక్రాన్ బీఏ.2.86 వేరియంట్ నుంచి జేఎన్.1 వేరియంట్ పుట్టుకొచ్చింది. దీన్ని తొలిసారిగా 2023 ఆగస్టు నెలలో గుర్తించారు. గతంలో వచ్చిన వేరియంట్లతో పోలిస్తే, ఒకటి, రెండు అదనపు జన్యు ఉత్పరివర్తనాల (మ్యూటేషన్లు) కారణంగా ఈ వేరియంట్‌కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల, ఇది శరీరంలోని రోగనిరోధక శక్తిని సులభంగా ఛేదించి ఇన్‌ఫెక్షన్ కలుగజేస్తుంది. "బీఏ.2.86 వేరియంట్‌తో పోల్చినప్పుడు జేఎన్.1లో ఒక మ్యూటేషన్ అదనంగా ఉంది. ఈ మార్పు, వేరియంట్‌లోని స్పైక్ ప్రొటీన్‌లలో స్వల్ప మార్పులకు కారణమవుతుంది. ఫలితంగా ఇది రోగనిరోధక శక్తి కంచెను దాటుకుని ఇన్ఫెక్ట్ చేయగలుగుతోంది" అని యేల్ యూనివర్సిటీ పరిశోధకులు వివరించారు.

### జేఎన్.1 వేరియంట్ సోకిన వారికి ఉండే లక్షణాలు:

జేఎన్.1 వేరియంట్ సోకిన వారిలో సాధారణంగా పొడి దగ్గు, రుచి కోల్పోవడం, తలనొప్పి, ముక్కు దిబ్బడ, తీవ్రమైన అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, ఈ వేరియంట్ బారిన పడిన కొందరిలో డయేరియా (విరేచనాలు) కూడా ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, ప్రస్తుతం భారత్‌లో పరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నేతృత్వంలో కొవిడ్ పరిస్థితిని సమీక్షించేందుకు ఉన్నతస్థాయి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం, నమోదవుతున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు చాలా వరకు ఓ మోస్తరుగానే ఉన్నాయని, బాధితులు ఆసుపత్రిలో చేరాల్సినంత తీవ్రత లేదని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!

మొదటి పేజి తరువాయి

కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ తన నోటీసులో స్పష్టం చేసింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్ గడువును ఏడుమార్లు పొడిగించింది.

# పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

మొదటి పేజి తరువాయి

వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం నడుస్తోందని జగన్ ఆరోపించారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకు బెదిరిపోకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ఆ విధంగానే ఉన్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తిరువూరు వంటి ప్రాంతాల్లో వైసీపీకి సంఖ్యాబలం ఉన్నప్పటికీ, టీడీపీ పోటీకి దిగడం, వైసీపీ ఆధిక్యం ఉంటే ఎన్నికలను నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసీపీ వారిని అరెస్టులు చేస్తూ, టీడీపీ వారిని వదిలేస్తున్నారని విమర్శించారు. "మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి. కానీ, మాకూ సమయం వస్తుంది. అప్పుడు అన్యాయాలు చేసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం. రిటైర్ అయిన వారిని కూడా లాక్కొచ్చి తీరుతాం. దేశం విడిచి పారిపోయినా రప్పిస్తాం" అని జగన్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు నాటిన విత్తనాలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని, మహిళలని కూడా చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కేసులో బెయిల్ వస్తే, వెంటనే మరో కేసు నమోదు చేస్తున్నారని, వల్లభనేని వంశీ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన నందిగం సురేష్‌ను కూడా అన్యాయంగా నెలన్నరకు పైగా జైల్లో ఉంచి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. రేపు కచ్చితంగా వైసీపీ కార్యకర్తే నంబర్ వన్ అవుతాడని, కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన భరోసా ఇచ్చారు. అన్యాయాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి తప్పదని పునరుద్ఘాటించారు.

# పోలీసులు విఫలమైతే నేనే రంగంలోకి దిగుతా: కేఏ పాల్



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను తక్షణమే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును హెచ్చరిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేసి, చనిపోయాడనుకుని వదిలేశారని కేఏ పాల్ తన ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో అన్యాయం, అక్రమ రవాణా, హింసాత్మక ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. "చంద్రబాబు గారూ... ధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోంది? మీ 50 సంవత్సరాల అనుభవం ఏమైంది?" అని ప్రశ్నించారు. పోలీసులు తమ విధులను సరిగా నిర్వర్తించడంలో విఫలమైతే, తానే స్వయంగా రంగంలోకి దిగుతానని కేఏ పాల్ స్పష్టం చేశారు. "పాస్టర్ ప్రవీణ్ ది హత్య అని చెబితే, యాక్సిడెంట్ అని పనికిమాలిన పోలీసులు సృష్టించారని కోట్లమంది కోడై కూశారు. మీరు అందులో ఫెయిలైపోయారు. పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళితుడ్ని బహిష్కరిస్తే మీరు అందులో చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు జేమ్స్ వ్యవహారం! అంటే రోజుకొక అన్యాయం, అత్యాచారం జరుగుతున్నాయి" అంటూ కేఏ పాల్ ధ్వజమెత్తారు. ప్రజలందరూ మే 24న సికింద్రాబాద్ లో జరగనున్న గ్లోబల్ పీస్ అసెంబ్లీలో పాల్గొనాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. "జేమ్స్‌కు న్యాయం జరగాలి" అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తక్షణమే దృష్టి సారించి, ప్రజలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన ..

మొదటి పేజి తరువాయి



ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం అన్నారు. లబ్ధిదారులు తమకు కావలసినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు పరిశీలిస్తే, "మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా?" అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యత ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారన్నారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదని, పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని చెప్పారన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు . ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి, ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారని, గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి, కంపోస్ట్ తయారీ చేపడతామని సీఎం తెలిపారు. ప్రభుత్వ సేవల్లో డాటా అనలిటిక్స్ కీలకమని సీఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖలు తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలిటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సీఎం సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా జూన్ 12 నుంచి ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు సీఎం ప్రకటించడంతో అధికారుల గుండెల్లో ఇప్పటి నుంచే గుబులు రేగుతోందని అంటున్నారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటనలకు వచ్చిన సమయంలో ప్రజలు నేరుగా అధికారులపై ఫిర్యాదు చేసే అవకాశాలు ఉండటంతో వారిలో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# 5 లక్షల మందికి 'యువవికాసం'

మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయి పరిశీలన.. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16.20 లక్షల దరఖాస్తులొచ్చాయి. లక్ష్యం మేరకు ఇందులో దాదాపు 5 లక్షల మంది యువతకు గరిష్ఠంగా రూ.4 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నారు. యూనిట్ కేటగిరీలవారీగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం అంచనా వేసింది. రూ.లక్ష లోపు రుణాల కోసం నిర్దేశించిన లక్ష్యం కన్నా దరఖాస్తులు తక్కువగా, రూ.1-2 లక్షలు, రూ.2-4 లక్షల యూనిట్ల కేటగిరీ రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించింది. ఉదాహరణకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.2-4 లక్షల విలువైన యూనిట్లు 20 వేలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. దాదాపు 3.24 లక్షల మంది పోటీపడుతున్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ కింద 22 వేల యూనిట్ల కోసం 6.66 లక్షల మంది, ఈబీసీల్లో 8 వేల యూనిట్ల కోసం 32 వేల మంది దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి కమిటీలు పనిచేస్తున్నాయి.




అనర్హులకు అడ్డుకట్ట..

దరఖాస్తుదారుల్లో అనర్హులను తొలగించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒకసారి సంక్షేమ కార్పొరేషన్ పరిధిలో లబ్ధి పొందినవారు ఐదేళ్లపాటు మరోసారి రుణం పొందేందుకు అనర్హులవుతారు. సంక్షేమ కార్పొరేషన్ల వద్ద ఉన్న డేటాబేస్‌తో దరఖాస్తులను పరిశీలించి అనర్హులను తొలగిస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను ఆధార్ డేటాబేస్‌తో పరిశీలించి, సరైన ఖాతాలు ఇచ్చారా.. లేదా.. పరిశీలిస్తున్నారు. మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, నగరపాలికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల జనాభా ఆధారంగా యూనిట్ల ఖరారుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కుటుంబానికి ఒక్కరికే స్వయంఉపాధి పథకం మంజూరు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

మొదటి పేజి తరువాయి




పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. మయన్మార్‌కు చెందిన ఈ రోహింగ్యాల వలసల వల్ల స్థానిక యువత తీవ్రంగా నష్టపోతోందని, వారికి దక్కాల్సిన ఉద్యోగావకాశాలు చేజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో స్థానికులకే ఉద్యోగాలు దక్కాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రధాన డిమాండ్. తెలంగాణ ఉద్యమంలోనూ ఇది కీలక నినాదం. కానీ, దేశ సరిహద్దులు దాటి వచ్చిన రోహింగ్యాలు ఇక్కడే తిష్టవేసి, మన యువత ఉపాధిని దెబ్బతీస్తున్నారు" అని పవన్ పేర్కొన్నారు. వారికి మన దేశంలో స్థిరపడేందుకు అవసరమైన గుర్తింపు కార్డులు ఎలా లభిస్తున్నాయన్న దానిపై ఆయన తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. "మన వ్యవస్థలోని కొందరు వ్యక్తులు వారికి సహకరించడం వల్లే ఇది సాధ్యమవుతోంది. దీనిపై లోతైన విచారణ జరగాలి. రోహింగ్యాలు మన పౌరులుగా మారి, మన అవకాశాలను ఎలా కొల్లగొడుతున్నారనే దానిపై ప్రజల్లో చైతన్యం రావాలి," అని ఆయన అన్నారు. ఈ వలసల వల్ల కేవలం నిరుద్యోగమే కాకుండా, అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోహింగ్యాలు స్థానికులుగా మారడానికి సహకరిస్తున్న యంత్రాంగంపై కఠిన నిఘా ఉంచాలని, అంతర్గత భద్రత విషయంలో మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా తాను పోలీసు ఉన్నతాధికారులకు లేఖ కూడా రాసినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించి, తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

### వాళ్ల కంటే మిన్నగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి: పవన్ కల్యాణ్

దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచడం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవేక్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలాపాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపించినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# బైటి పేట నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ.ఎస్.పి జావళి ఆల్ఫోన్స్ సూచనలతో మంగళవారం తెల్లవారుజామున జిల్లా పట్టణ కేంద్రంలోని బైటి పేట నందు నంద్యాల వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూ.ఆర్.టి సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సెర్చ్ ఆపరేషన్ నందు అనుమానితుల ఇల్లు, అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్లు నేరచరిత్ర గల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు బైటి పేటలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనుమానితులు మరియు నేరచరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లని తనిఖీచేసి సరైన ధ్రువపత్రాలు లేని 10 బైక్ లు 2 ఆటో లు స్వాధీనం చేశారు. అనంతరం బైటి పేట లోని ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి పత్రాలు లేని వాహనాలను కొనడం, తాకట్టు పెట్టుకోడం, దొంగలించడం లాంటి పనులు చేయరాదని,గంజాయి రవాణా ,విక్రయం లాంటి నేరాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రౌడీ షీట్లు ఓపెన్ చేసి పీడీ అక్ట్ పెడతామని హెచ్చరించారు.




## పత్రిక, మీడియా, సోషల్ మీడియా కన్వీనర్ గా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్

నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): కడప లో జరుగు మహానాడు 2025 కమిటీలను టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మే 20వతేది మంగళవారం మహానాడు కమిటీలను ప్రకటించారు.అందులో పత్రిక, మీడియా, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ గా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని ప్రకటించారు.

## డి వడ్డీపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా చింతమాను భాస్కర్



తిరుపతి జిల్లా, శుభోదయం న్యూస్: దక్కిలి మండలం డి వడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శలను ఎన్నుకొన్నారు. ఇందులో భాగంగా డి.వడ్డీపల్లి పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పొలంరెడ్డి కోటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రనాయుడు ఆదేశాల మేరకు డి.వడ్డిపల్లి పంచాయతీ అధ్యక్షులుగా చింతమాను భాస్కర్ ఉపాధ్యక్షులుగా తిరుపతి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వేపమాను రాములు లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా డి వడ్డిపల్లి పంచాయతీ అధ్యక్షులు చింతమాను భాస్కర్ మాట్లాడుతూ టీడీపీ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబయుడు ఆదేశాల మేరకు అలాగే మా ప్రియతమ నాయకులు వేంకటగిరి శాసన సభ్యులు కురుకొండ్ల రామకృష్ణ ఆదేశాలతో దక్కిలి మండల నాయకులు, పంచాయతి నాయకుల ఆధ్వర్యంలో నన్ను డి.వడ్డిపల్లి పంచాయతీ టీడీపీ పార్టీ అధ్యక్షులు గా ఎన్నుకొన్నందుకు పేరుపేరునా అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూన్నారు. పార్టీ నాపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవయ్య గారి మహేంద్ర ఆర్గనైజర్ సెక్రెటరీ,మోకాల గురవయ్య ఆర్గనైజర్ సెక్రెటరీ,చింతమాను వెంకటరమణమ్మ కోశాధికారి, వేపమాను చలపతి జనరల్ సెక్రటరీ,పాపయ్య గారి లక్ష్మి జనరల్ సెక్రటరీ, చింతమాను పెంచలనరసయ్య జనరల్ సెక్రటరీ, తిరుపతి ఈశ్వరయ్య జనరల్ సెక్రెటరీ,టీడీపీ సీనియర్ నాయకులు మొదలగు వారు పాల్గొన్నారు.

## సెలవుల్లో పిల్లల్ని జాగ్రత్తగా చూసుకొనే బాధ్యత తల్లిదండ్రులదే : పోలవరం ఎమ్మెల్యే చిర్రి



శుభోదయం న్యూస్, జీలుగుమిల్లి : వేసవి సెలవలు నేపథ్యంలో తల్లి దండ్రులు పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి హాని జరగకుండాచూసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలియజేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇటీవలె జరిగిన పలు సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో విహార యాత్రలకు అలాగే పలు ప్రాంతాలు సందర్శనలకు వెళ్ళేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల సరైన జాగ్రత్తలు తీసుకొని వారి కదలికలను గమనిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వేరు వేరు సంఘటనలలో నిర్లక్ష్యం గా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20 మంది కి చేరడం బాధాకరం అని, ముందస్తుగా వారిపట్ల బాధ్యతగా వ్యవహరించి ఉంటె ప్రాణ నష్టం తీవ్రత తగ్గేదని, కొన్ని రోజుల క్రితం బుట్టాయిగూడెం మండలం దొరమామిడి అలివేరు ప్రాజెక్టు లో ప్రమాదవుసాత్తు ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన ఆయన్ని కలచి వేసిందని అన్నారు. ముందుగానే మెలుకువగా ఉండి పిల్లలు కదలికలు గమనించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రతి తల్లి దండ్రలకు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంచురి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



పామూరు, మండల రిపోర్టర్ బండి (రమేష్ శుభోదయం న్యూస్): పామూరు మండల గోపాలపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అంచురి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు పామూరులో వారి ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు వారి మిత్రులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య, మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, చిన్న హజరత్, ఓగురి నరసింహ, ఎద్దుల శివ, రవికుమార్, సిద్ధవటం మంజునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పామూరులో ఘనంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): నందమూరి నటసింహం, తాతకు తగ్గ మనవడు, కొన్ని కోట్ల మంది గుండె చప్పుడు యంగ్ టైగర్ మాన్ అఫ్ మెస్సేస్ జూ" నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలు పామూరు పట్టణ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా కెబి ధీయేటర్ లో ఎన్టీఆర్ అభిమానుల మధ్య 5కేజీ ల కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలపడం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద 20 మంది అనాధలకు భోజనం మరియు మజ్జిగ పంపిణి చేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ తన నటనతో,నడవడికతో తెలుగు ప్రేక్షకుల మన్ననలను పొందుతూ దూసుకుపోతున్న ఎన్టీఆర్ భవిష్యత్తులో మీరు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో పట్టణ జూ ఎన్టీఆర్ ఫ్యాన్స్ మెంటా ఆనంద్, పెరమన విజయ్ కుమార్ చారి, నాగేంద్ర, సుకేష్, లక్ష్మణ, సద్దాం, వినయ్, భార్గవ్ ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త పెండ్యాలను అభినందించిన బైరెడ్డి, దారపనేని



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో భక్తి శ్రద్ధలతో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని భక్తులు ఇలవేల్పుగా భావించి మొక్కులు తీర్చుకుంటుంటారు. అటువంటి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని భక్తులందరికీ నిత్యం దర్శనం చేసుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసాలతో దేవస్థానాన్ని నిర్మించిన ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ రావు ను దారపనేని చంద్రశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డి లు అభినందించారు. వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో దేవస్థానంలో శుభకార్యాలు జరుపుకునేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారని పెండ్యాల సూర్యనారాయణరావును కొనియాడారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బైరెడ్డి, దారపనేని లకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# గన్నవరం నియోజకవర్గంలో అత్యంత వైభవంగా మహానాడు - 2025






గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) బడుగు, బలహీన వర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీలిఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ సమాజంలో సమానత్వం కోసం పనిచేస్తాంగన్నవరం నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీని పటిష్టం చేస్తాంప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం లోని ఏబి కన్వెన్షన్ హాల్ నందు గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు అధ్యక్షతన మహానాడు 2025 ను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్, కృష్ణాజిల్లా మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంటు సభ్యులు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పాల్గొన్నారు.ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రతిమకు పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం 20 అంశాలతో తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, మహానాడు - 2025 - ఆమోదించిన తీర్మానాలు.జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆ ఘటనలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ అలాగే పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారతదేశం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ 2025లో శత్రువులతో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన భారత సైనిక దళానికి చెందిన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబివృద్ధికి విశేషమైన సేవలు అందిస్తూ అసువులు బాసిన శ్రీమతి మండవ రమ్య కృష్ణ, తాళం సురేష్, శ్రీ కూచిపూడి సుబ్బయ్య (మాస్టారు), మరీదు గోవిందులు, మల్లాది సుదీర్, శ్రీ అద్దేపల్లి సంజీవ రాజు తదితరులకు నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం.ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పటివరకు 2 కోట్ల 67 లక్షల రూపాయలను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఏకగ్రీవ తీర్మానం. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ కు ఎక్కువ పరిశ్రమలు తరలివచ్చి అభివృద్ధి చేసేందుకు వీలుగా భూమి ధరలను గణనీయంగా తగ్గించి గత టిడిపి ప్రభుత్వం అమలు చేసిన విధానంలోనే పారిశ్రామికవేత్తలకు భూమిని కేటాయించేందుకు వీలుగా పాలసీ రూపొందించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం.పోలవరం కుడికాలువ 137వ కి.మీ వద్ద బండారగూడెం నుండి ఏలూరు కాలువ 36వ కి.మీ కు గోదావరి జలాలను తీసుకువచ్చే లింక్ ఛానల్ కు సవరించిన అంచనాల ప్రకారం 32 కోట్ల నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఎకగ్రీవ తీర్మానం.నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ లో 2.36 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, అందులో భాగంగా గన్నవరం నియోజకవర్గం నాగార్జునసాగర్ ఎడమ కాలువలోని 60 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకంకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానంగన్నవరం నియోజకవర్గనికి చెందిన దాదాపు 15 వేలమంది నిరుపేదలకు ఇళ్ళ స్థలాలను కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎదురుగా ఉన్న సుమారు 12.50 ఎకరాల్లో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం మండల పరిధిలోగల బ్రహ్మలింగయ్య చెరువును వాటర్ రిజర్వాయర్ గా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గ పరిదిలోని ఏలూరు కాలువ పైన ఎనికేపాడు, రామవరప్పాడు, జక్కుల నెక్కలం గ్రామా ప్రజల చిరకాల స్వప్నమైన మూడు బ్రిడ్జిలను నిర్మాణం చేసేందుకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.బుడమేరు మెజర్ డ్రెయిన్ చానలైజేషన్ (కి.మీ. 0.00 నుండి 12.00 వరకు ప్యాకేజీ నంబర్ 15-1-1/10-11) పనుల కోసం అవసరమైన భర్తీకి సంబంధించిన నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గ పరిధిలోగల విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాలకు తాగునీటి సమస్యలు తీర్చేందుకు విజయవాడ కార్పొరేషన్ నుండి కృష్ణానది ద్వారా వచ్చే త్రాగునీటిని ప్రజలకు అందించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో పెరుగుతున్న జనాభా ప్రకారం గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్ ను 30 బెడ్స్ నుంచి 100 బెడ్స్ హాస్పిటల్ గా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గానికి ప్రత్యేక విద్యుత్ సబ్ డివిజన్ ను ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం. గన్నవరం నియోజకవర్గం, విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో 3.48 సెంట్లు భూమిని జీవో నెంబర్ 480/2008 ద్వారా గృహ నిర్మాణాల కోసం అప్పటి ప్రభుత్వం కేటాయించింది కానీ నేటి వరకు ఈ స్థలాన్ని పాత్రికేయులకు అప్పగించలేదు, వెంటనే ఈ స్థలాన్ని ది. విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ మున్సిపాలిటీ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ నకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బుడమేరు కెనాల్ కు 9చోట్ల ఏర్పడిన గండ్లను అలాగే వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలో గుర్తించిన 23 చోట్ల ఏర్పడిన గంటలను మరమ్మత్తులు చేసేందుకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రహ నిర్మాణం.గన్నవరం నియోజకవర్గానికి నూతన కాలేజ్ ను కేటాయించాలని, గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సును ప్రవేశ పెట్టవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.రాష్ట రాజధాని అమరావతికి ప్రధాన ద్వారం అయిన గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం, రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు, విదేశీ అతిథులు, విఐపిలు మొదలైన వారికి తొలిగా చూసేటువంటి ప్రాంతం కావున జాతీయ రహదారి డివైడర్లు, పుట్‌పాత్‌ల సుందరీకరణ పనులకు అవసరమైన నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీని గ్రామ గ్రామంలో పటిష్టం చేస్తున్నామని, కష్టపడి పనిచేసిన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సమాజంలో సమానత్వం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని రకాలుగా గన్నవరం నియోజకవర్గాన్ని విధ్వంసం వైపు నడిపించారని ప్రస్తుతం వాటి నుండి కోలుకొని పూర్వవైభవం దిశగా గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా గన్నవరంలోని వారి క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదించినట్లయితే వారి సమస్యకు తగిన పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో చరిత్రలో ఎన్నడూ లేని మెజారిటీతో తనను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు మరొకసారి కృతజ్ఞతలు తెలియజేశారు.పలువురు నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీలో అన్ని రంగాల్లో పెద్ద పేట వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి వైపు గన్నవరం నియోజకవర్గాన్ని నడిపిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడవల్లి నరసింహారావు, మూల్పూరి సాయి కళ్యాణి, బొప్పన హరికృష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, కోనేరు నాగేంద్రబాబు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల వెంకట గోపాలకృష్ణరావు, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డలి చిన్న రామారావు, కొలుసు రవీంద్రబాబు,

పొదిలి లలిత, పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, మేడేపల్లి రమ, బోడపాటి రవికుమార్, కోనేరు సందీప్ పుట్టా సురేష్, కుందేటి చంద్రశేఖర్, వడ్డీల్లి లక్ష్మి, మొవ్వ వెంకటేశ్వరరావు, కొల్లా ఆనంద్, కానూరు యుగంధర్, అన్ని హరికృష్ణ, తంగిరాల శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, కలపాల కుమార్, చిన్నాల లక్ష్మీనారాయణ, కొమ్మారెడ్డి రాజేష్, గుల్లిపల్లి సందీప్, అరికట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం పట్టణంలో
### శ్రీ కన్యక పరమేశ్వరి కళాశాల నూతనంగా అడ్మిషన్లు పున: ప్రారంభం



మార్కాపురం, శుభోదయం న్యూస్: ఈరోజు మార్కాపురం పట్టణంలో ఎస్వికెపి కళాశాల పునః ప్రారంభించడం జరిగింది. బిఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించడం జరిగింది. ఈ అవకాశంను చుట్టుపక్కల మండలాల పేద విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని సకల నరసింహులు



సెక్రటరీ కోరడం జరిగింది. ఈరోజు ప్రత్యేక పూజా కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ : సకల నరసింహులు మరియు కళాశాల సిబ్బంది బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి బలరాంరెడ్డి సూపర్డెంట్ ఆఫ్ కలెక్టరేట్, కర్నూలు బాలయ్య, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, మార్కాపురం ఉపాధ్యాయులు శ్రీ నల్లబోతుల శ్రీనివాసరావు, శ్రీ దేవలూటి శంకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కమలా విద్యా సంస్థల ఛైర్మన్ : పెనుగొండ కేశవరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుబ్బారావు , తమ్మిశెట్టి వెంకటేష్ ,రాజేష్ కుమార్ విజన్ న్యూస్ డాక్టర్ రామేశ్వరుడు తదితర పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయింపు
### - జూన్ 5 నుంచి నిర్మాణ పనులు ఆరంభం



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి మిట్టగుడిపాడు గ్రామ సమీపంలో ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు నిర్ణయం గైకొన్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.4 కోట్ల 10 లక్షలు ఐటిడిఏ కేటాయించగా స్థల సేకరణ చేసిన రెవిన్యూ అధికారులు మిట్టగుడిపాడు లోని కస్తూర్బా విద్యాలయం సమీపంలో గల 447/3 సర్వే నెంబర్ లోని 6.5 ఎకరాల్లో 5 ఎకరాల భూమిని ఐటీడీఏ కు అప్పగించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే జూన్ 5 నుంచి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. వైసీపీ హయాంలో 2020 జూలైలో రూ.4.5 కోట్ల నిధులు గురుకుల పాఠశాలకు మంజూరైనప్పటికీ నాటి రాజకీయ నేతల అలసత్వం, స్థలం కేటాయింపు జాప్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లాయి. ఈ విషయాన్ని ఇటీవల స్థానిక నేతలతో పాటు ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన రెవెన్యూ వర్గాలతో, ఐటిడిఏ అధికారులతో పలుమార్లు సంప్రదింపులు చేసి గురుకుల పాఠశాల నిర్మాణానికి కార్యరూపం చేసి ఎన్నికల హామీ నెరవేర్చారు.

## ఘనంగా శివాలయ వార్షికోత్సవ కల్యాణ వేడుకలు



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): ఆలయాల ప్రాశస్త్యానికి, భక్తుల నమ్మకానికి గుర్తుగా నిలిచే వార్షికోత్సవాలను పురస్కరించుకుని రెంటచింతల లోని శివాలయం(మల్లేశ్వర స్వామి దేవస్థానం)లో మంగళవారం ఆలయ 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం రమణీయంగా కనులపండువగా జరిగింది. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం లక్ష మల్లెల అర్చన, శాస్త్రోక్తంగా శివపార్వతుల శాంతి కల్యాణం జరిపారు. మధ్యాహ్నం మంత్రపుష్పం, మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, అన్న సమారాధన నిర్వహించారు. స్వామివార్లకు మహిళలు సారె చీర, ఒడి బియ్యం నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి భక్తి పారవశ్యం చెందారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రామిరెడ్డి, ఆలయ నిర్వాహకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశం వర్ధంతి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం 69వ వర్ధంతి వేడుకలను స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పుష్పగుచ్చాలతో అలంకరించిన ఆంధ్ర కేసరి చిత్రపటానికి ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణపురం శ్రీనివాసరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు ప్రకాశం పంతులు సేవలను, ఆశయాలను స్మరిస్తూ అన్యాయాన్ని ఎదిరించడం, నిజాన్ని నిర్భయంగా చెప్పడం వంటి నైజం గల ప్రకాశం పంతులు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోను, స్వరాష్ట్ర సాధన లోను ప్రకాశం పంతులు కీలక పాత్ర పోషించారన్నారు. బ్రిటిష్ తుపాకి కి గుండెను చూపిన సాహసి ఆంధ్ర కేసరి తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి తరతరాలకు స్ఫూర్తిదాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కె శివ, కాసిం, వై శ్రీనివాసరావు, జల్లా వెంకటేశ్వర్లు, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల దిశగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మరో అడుగు.





ఉమ్మడి, అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్) : రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు.ధర్మవరం, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, ధర్మవరం రూరల్ మండలంలోని నెలకోట గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న మంచినీటి కొరతకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు, మంగళవారం గ్రామంలో బోరు పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు స్వయంగా ప్రారంభించి, పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామ ప్రజలు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను గుర్తించి, తక్షణమే స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , సంబంధిత అధికారులను ఆదేశించడంతో బోరు వేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కి, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మా గ్రామంలో త్రాగునీటి సమస్యతో చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు బోరు వేయించడంతో ఆ సమస్యకు మార్గం దొరికింది. ఇది మా గ్రామానికి ఓ గొప్ప ఆశీర్వాదం, అని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి కిసాన్ విద్యుత్ యోజన ( ఆర్ డి ఎస్ ఎస్) ద్వారా గ్రామాల్లో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను కూడా హరీశ్ బాబు సమీక్షించారు. విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పునర్నిర్మాణ పనుల పురోగతిని అధికారులచే తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు గృహ వినియోగానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించబడుతుంది. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించేందుకు, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా హరీశ్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నేలకోట రాము, బిల్లే శ్రీనివాసులు, సుబ్బారావుపేట పవన్ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పడమటి కటకిందపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడుని సన్మానించిన పువ్వాడి, యారవ



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్రన్న గారి అదేశాలమేరకు! తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా... గ్రామ టిడిపి అధ్యక్షుడిగా గట్ల కొండారెడ్డి,ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి చందు, ప్రధాన కార్యదర్శి మద్దిబోయిన కొండయ్య గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈసమావేశంలో పామూరు మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమా శ్రీనివాస్,రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు,యస్.డి అమీర్ బాబు , క్లస్టర్ ఇంఛార్జీ గుంటుపల్లి శ్రీను, యస్. కె రసూల్(కావేరి) భస్వి రమణయ్య, దేవదానం,వెంకటరెడ్డి,స్థానిక టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా అంచురి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు





పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండల గోపాలపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అంచురి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు పామూరులో వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు వారి మిత్రులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య, మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, చిన్న హజరత్, ఓగురి నరసింహ, ఎద్దుల శివ, రవికుమార్, సిద్ధవటం మంజునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపూడి లో ఘనంగా అర్బన్ హెూం సొల్యూషన్ ప్రారంభం




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : :మే 20 : విజయవాడ రూరల్ గొల్లపూడి వన్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చేవూరి రామస్వామి నూతనంగా ఏర్పాటుచేసిన అర్బన్ హెూమ్ సొల్యూషన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఈ అర్బన్ హెూమ్ సొల్యూషన్ వారి సేవలను విజయవాడ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్బన్ హెూమ్ సొల్యూషన్ ప్రోపరేటర్ కట్టె పోగు శ్రీకాంత్ మాట్లాడుతూ అతి తక్కువ ధరలకే సీసీ కెమెరా ఇన్స్టాలేషన్, రిపేర్ తదితర హెూం నీడ్ సౌకర్యాలను తమ వద్ద లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్, ఏబిసిడి ఫౌండేషన్ చైర్మన్ ఆవుల వెంకట్రావు, హైకోర్టు అడ్వకేట్




ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ సంఘ కోశాధికారి షైక్ నసీమా, హైకోర్టు అడ్వకేట్ జనగం నాగమల్లేశ్వరి, తెలుగుదేశం పార్టీ 62వ డివిజన్ ఉపాధ్యక్షులు, అడ్వకేట్ పోకతోట శివకృష్ణ, హై కోర్ట్ అడ్వకేట్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కష్టాలలో భరోసాగా నిలుస్తున్న శ్రీ లక్ష్మీనరసింహా దత్త సేన సేవా ట్రస్ట్..



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండల పరిసర ప్రాంత ప్రజలకు కష్టం వస్తే ఓ చుట్టంగా మేమున్నము అంటూ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ మనోధైర్యాన్ని కల్పిస్తూ అందరికీ అయిన వారిలా కష్టాలో ఉన్నవారి సహాయం చేయడం తమ బాధ్యత గా తెల్చి ఎన్నో వందల కుటుంబాలకు సహాయం అందిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ సేవలను ప్రజలు ప్రసంశిస్తున్నారు.. శ్రీ లక్ష్మీనరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ సేవలలో భాగంగా ఇటీవల అనారోగ్యంతో




మరణించిన శానం.అచ్చయ్య కుటుంబానికి సహాయంగా 50 కేజీల బియ్యం దశదిశ కర్మలకు సహాయంగా అందించడం జరిగింది,తదుపరి ఇటీవల వడదెబ్బ వల్ల మరణించిన బుడుగుల.పిచ్చయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం దశదిశ కర్మలకు సహాయంగా అందించడం జరిగింది..

## దేవదాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ నాయకులు గడ్డం మధు డిమాండ్



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): ఇటీవలే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా దేవదాయ శాఖ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో స్థానికంగా ఎంపీ అయినా గడ్డం వంశీకృష్ణ గారి ఫోటో పెట్టకుండా మరియు సీఎం పర్యటనకు ఎంపీ గారికి కనీసం ఆహ్వానం కూడా ఇవ్వలేదు. సాక్షాత్తు పార్లమెంట్ సభ్యుడు భారతదేశంలో అత్యున్నతమైన స్థానం పార్లమెంటు అలాంటి పార్లమెంటు నుంచి చట్టం రాయబడతాయో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఆ రోజే కులాలకు గౌరవ రావాలంటే రిజర్వేషన్లు ఇచ్చి చట్టసభల్లో ఉంటేనే గౌరవించబడతారని ఆలోచనతో ఆనాడు రాజ్యాంగాన్ని రాశారు కానీ నేడు కేవలం ఒక దళిత ఎంపీ అయినందుకేనా ఈ అవమానం కాక కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఐదు దశాబ్దాల అనుబంధం ఉంది ఏకంగా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి కాక గారు తన సొంత ఇంటిని పార్టీకి ఇచ్చిన గొప్ప వ్యక్తి అలాంటి కాక వారసుడిగా రాజకీయాల్లో అడుగుపెట్టి ప్రజల చేత ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యునిపై కుల వివక్షన సరికాదని యువకుడిగా కేవలం 35 ఏళ్ల వయసులోనే ఎంపీగా గెలిచిన నాటినుండి నేటి వరకు సింగరేణి ప్రాంత సమస్యలపై మరియు నిరుద్యోగుల కోసం నిత్యం పార్లమెంట్లో ఎప్పటికప్పుడు తన గళం విప్పుతూ ప్రజల చేత మన్ననలను పొందుతున్నారని కాంగ్రెస్ పార్టీలో కాక కుటుంబానికి ఉన్న అనుబంధం ఉన్న వ్యక్తి కాబట్టి ఇప్పుడు కట్టడి చేయకపోతే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని కొంతమంది నాయకులు కావాలని కార్యక్రమాలకు పిలవకుండా ప్రోటోకాల్ పాటించడం లేదు. దయచేసి ఇలాంటి పొరపాట్లు మున్ముందు జరగకుండా మరియు సరస్వతి పుష్కరాల్లో ప్రోటోకాల్ పాటించని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ గడ్డం మధు డిమాండ్ చేస్తున్నాం.

### అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డ్
### దొడ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మునుగోడు నియోజకవర్గం



మునుగోడు నియోజకవర్గం మే 20 శుభోదయం న్యూస్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా మరింత సమర్థవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారు. వన్ స్టేట్ %-% వన్ కార్డు ఆలోచనతో చేపట్టిన ఈ బహుళ ప్రయోజన కార్డుల జారీ ప్రక్రియను ప్రజలంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనకు సంబంధించిన సర్వే పత్రాలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సిఖ్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగారు లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాధాన్యతను ముఖ్యమంత్రిగారు వివరించారు.రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందజేస్తారు.ఇందుకోసం 3 నుంచి 7 వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ప్రతిపక్షాలు దీనిపై ఎవైనా సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలి.కుటుంబంలో సభ్యులు పెరిగినందున ప్రజలంతా కుటుంబ డిజిటల్ కార్డు కోసం వివరాలను నమోదు చేయించుకోవాలి. ఇందులో అవసరమైన మార్పుచేర్పులు ఎప్పుడైనా చేసుకోవచ్చు.ఒక్క క్లిక్ తో కుటుంబ సమగ్ర సమాచారం ఉండాలన్న ఆలోచనతో ఈ విధానం తీసుకొచ్చాం.ఒకసారి కార్డు పొందిన తర్వాత రేషన్ తో పాటు ఇతర ప్రభుత్వ సౌకర్యాలను ఎక్కడి నుంచైనా పొందడానికి వీలుంటుంది.

## నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ చేయూత లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో మంగళవారం రోజున మా లైన్ నెంబర్ మంతెన సతీష్ మౌనిక గార్ల వివాహ వార్షికోత్సవ సందర్భంగా, పేపర్లో వచ్చిన కథనం చూసి వీళ్ళ దీనగాథను అర్థం చేసుకొని వెంటనే ఉదయం 9 గంటలకు మా క్లబ్ సభ్యులు వారి తక్షణ అవసరార్థం మంతెన సతీష్ 50 కేజీల బియ్యంతో పాటు మిగతా క్లబ్ సభ్యులు నగదును అందించడం జరిగింది. వీళ్ళ పరిస్థితి చాలా దిన స్థితిలో ఉంది కావున ఇంకెవరైనా దాతలు వెంటనే స్పందించి వీరిని ఆదుకోవాలని మా క్లబ్ పక్షాన కూడా కోరుచున్నాము, ఇట్టి కార్యక్రమంలో మా క్లబ్ అధ్యక్షులు నార్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారి కోదాటి ప్రవీణ్, జయప్రకాశ్ చౌడ, బొల్లం అరుణ్ కుమార్,నల్ల మను మల్లికార్జున్,శేగంటి విక్రం, మంతెన మౌనిక సతీష్ దంపతులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్ నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు స్వీకరించిన వీరాబాయ్

చౌటుప్పల్ మే 20 (శుభోదయం న్యూస్): చౌటుప్పల్ మండల మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మార్వో గా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు వీరా బాయ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల్ మండల పట్టణ పరిధిలో సమస్యలను పరిష్కరించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పట్టణంలో ప్రజలు ఎదుర్కునే సమస్యల పై కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

## సీ ఎం పిఎఫ్ లెక్కలు, పుస్తకాలు, చిట్టీలను వెంటనే ఇవ్వాలి






గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సీఎం పిఎఫ్ లెక్కలు పుస్తకాలు చిట్టీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున గోదావరిఖని సీ ఎం పి ఎఫ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాని ఉద్దేశించి ఐఎఫ్టియు అన్న రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, ఎస్ సి సి డబ్ల్యు యు ( ఐఎఫ్టియు ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్నలు మాట్లాడుతూ సింగరేణిలో వివిధ డివిజన్ లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సుమారు మూడున్నర సంవత్సరాలుగా వారి యొక్క సీఎం పిఎఫ్ పూర్తి లెక్కలు లేకని ఎంత జమ అయినాయో వివరాలు నేటికీ పుస్తకాల రూపేన గాని చిట్టీల రూపన గాని ఇవ్వలేదన్నారు దీనివల్ల కార్మికులు అందోళనకు గురవుతున్నారని కొంతమంది కార్మికులు పని నుండి దిగిపోయిన వాళ్లకు సంబంధించి చనిపోయిన కార్మికులకు సంబంధించిన కటింగ్స్ కాబడిన డబ్బులు దరఖాస్తు చేసుకున్న వారికి నేటికి ఇవ్వలేదన్నారు. కొంతమంది కార్మికులు లోన్ పెట్టుకున్న వారికి కూడా లోన్ ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సీఎం పిఎఫ్ అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు తగిన విధంగా సీ ఎం పి ఎఫ్ పూర్తి వివరాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పై విషయాలన్నీ పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలని వెంటనే కార్మికులకు లెక్కలు తేల్చి వారికి పుస్తకాల రూపంలో లేదా చిట్టిల రూపంలో ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ నరేష్, బి అశోక్, బి రాజేశం,ఈ రామకృష్ణ, జి మల్లేశం, ఎ్ల రవికుమార్,డి బుచ్చమ్మ, కే రాజేశ్వరి, ఐరుగురాళ్ల గట్టయ్య , విజయలక్ష్మి, ఎం ఓదెలు జి లింగయ్య, బి శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టం- 2025 అవగాహన కార్యక్రమం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆధ్వర్యంలో






రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): పెద్దపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు విజయ రమణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూభారతి కార్యక్రమం లో పాల్గొన్న రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్,రామగుండం నియోజకవర్గం లో అదనంగా మరో తహసిల్దార్ కార్యాలయం మంజూరు చేయాలి అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, మంచిర్యాల జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ పాల్గొన్నారు.



## వలిగొండ ఎమ్మార్వో గా పదవి బాధ్యతలు చేపట్టిన దశరథ

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వలిగొండ మండల ఎమ్మార్వోగా డి దశరథ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని అన్నారు.

## నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ చేయూత

## లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో

## 50 కిలోల బియ్యం, రూ.2,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేత



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో మంగళవారం రోజున మా లైన్ నెంబర్ మంథెన సతీష్ మౌనిక గార్ల వివాహ వార్షికోత్సవ సందర్భంగా, పేదల్లో వచ్చిన కథనం చూసి వీళ్ళ దీనగాధను అర్థం చేసుకొని వెంటనే ఆడియం 9 గంటలకు మా క్లబ్ సభ్యులు వారి తక్షణ అవసరార్థం మంథెన సతీష్ 50 కేజీల బియ్యంతో పాటు మిగతా క్లబ్ సభ్యులు నగదును అందించడం జరిగింది. వీళ్ళ పరిస్థితి చాలా దీన స్థితిలో ఉంది కావున ఇంకెవరైనా దాతలు వెంటనే స్పందించి వీరిని ఆదుకోవాలని మా క్లబ్ పక్షాన కూడా కోరుచున్నాము, ఇట్టి కార్యక్రమంలో మా క్లబ్ అధ్యక్షులు నాళ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారి కోదాటి ప్రవీణ్, జయప్రకాశ్ గౌడ్, బొల్లం అరుణ్ కుమార్,నల్ల మను మల్లికార్జున్,సెగంటి విక్రం, మంథెన మౌనిక సతీష్ దంపతులు పాల్గొన్నారు.

## 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలి, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి వేల్పుల కుమారస్వామి,జిల్లా అధ్యక్షులు



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): సీఐటీయూ ఆధ్వర్యంలో ఈరోజు గోదావరిఖనిలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పలు సెక్షన్లపై నిరసన కార్యక్రమాలు జరిగాయి. దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు గోదావరిఖని ఆర్జీ 1 ఏరియాలో ఉన్న వివిధ కాంట్రాక్టు కార్మికుల సెక్షన్ల వద్ద కార్మికులు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి షెడ్లో తో నిరసనలు తెలిపి విధులకు హాజరైనారు. ఈసందర్భంగా వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం రోజు దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మె కు పిలుపునివ్వడం జరిగింది. కానీ దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్టిలో పెట్టుకొని సమ్మెను జూలై 9 కి వాయిదా వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ పిలుపులో పాల్గొన్న కార్మికులకు సీఐటీయూ తరుపున విప్లవ అభినందనలు తెలిపారు.దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలు 4 లేబర్ కోడ్లుగా మార్చి పెట్టుబడి దారులకు అనుకూలంగా



చేశారని అన్నారు. ఇవి అమలు అయితే కార్మికులు యజమానులకు బానిసలుగా మారే అవకాశం ఉందని అన్నారు. వీటిని అడ్డు కోవడానికే ఈ నిరసనలు అని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చడానికి మోడీ ఎవరు అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం కనీస వేతనం 178 రూపాయలు ఉంటే సరిపోతుందని చట్టం చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కనీసం రోజుకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణిలో ఎందుకు కోల్ ఇండియా వేతనాలు అమలు చేయించడం లేదని అన్నారు. అదేవిధంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీఐటీయూ గోదావరిఖని పట్టణ కార్యదర్శి ఎం,సారయ్య, నాయకులు రాజు,మధు,రాజేందర్,రాజయ్య,అంజి,ఆనంద్,దారి,ఖాళీ,అదిలక్ష్మి,ఇంద్ర, కోమలత, రోజా, కుమార్, మరియమ్మ, వసంత,శాంతి,కోమల,దీక్ష కుమారి,రాజేశ్వరి, కార్తిక్,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్



వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్,హనుమంతరావు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని హమాలీల కొరత ఉన్నచో ఇతర సెంటర్ల నుండి హమాలీలను రప్పించి ధాన్యం బస్తాలను తూకం వేసి మిల్లులకు తరలించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలి



వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలోని ఏ పీ ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి,జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వం బడ్జెట్లో వేల కోట్లు రూపాయలు కేటాయిస్తున్నామని గొప్ప ప్రచారాలు చేసుకుంటూ మరోవైపు కూలీలకు కనీస సౌకర్యాలు అందలేని పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు, పనిచేస్తున్న కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదని దీనిద్వారా కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన కూలీతోపాటు వారు ఎంత పని చేశారో అర్థం కాని పరిస్థితి ఏర్పడ్డాయని వెంటనే పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీల పని ప్రదేశంలో మంచినీరు మరియు నీడకు టెంటు అందుబాటులో లేదని దీని ద్వారా కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పని ప్రదేశాల్లో మంచినీరు టెంటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మండల కేంద్రంలో పాటు అనేక గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లేక కూలీలకు పనులు కల్పించలేని పరిస్థితి ఏర్పడ్డాయని దీంతో కూలీలు పనులు కోల్పోతున్నారని వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు చేసిన పనికి అదనంగాఎండాకాలంలో ఇచ్చే సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం జరిగిందని వెంటనే పథకాన్ని తిరిగిపునరుద్ధరించాలని డిమాండ్ చేశారు, పనిచేస్తున్న కూలీలకు ప్రమాదవశాత్తు గాయాలు జరిగితే తక్షణ ఉచిత వైద్యాన్ని అందించాలని, ప్రమాదంలో చనిపోయిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఓ కి పరుశురాములుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ ధర్నాలోప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి,ముత్యాలు,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వేముల లక్ష్మయ్య, మీసాల పోశయ్య, కిన్నెర యాదయ్య, ఐద్వా మండల కార్యదర్శి బూడిద మనమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కూలీలు షేక్ కరీం, బంగారు బుచ్చయ్య, వీసం అంజయ్య, కందుకూరి బుచ్చయ్య,మీసాల ఎల్లమ్మ, ఐతరాజు బుచ్చయ్య, లోతుమల్ల వనజ,సిర్పంగి సత్తమ్మ,మీసాల జ్యోతి, మాదుగుల లింగమ్మ, హంసమ్మ,పూలమ్మ,ఈశ్వరమ్మ, కొండ భారతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి-సి ఐ టి యు





వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):మోదీ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత,తీసుకువచ్చిన నాలుగు కోడ్ లను రద్దు చేయాలని సిఐటియు వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది.సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 3 వ సారి అధికారంలోకి వచ్చినాక కార్మికులు బ్రిటిష్ సంఘంలో పోరాడి,సాధించుకున్న 29చట్టాలను సవరణ లు చేస్తూ,వేతనాల కోడ్,పారిశ్రామిక సంబంధాల కోడ్, ఫ్యాక్టరీ,చట్టాలసామాజిక భద్రత కోడ్ ఈ నాలుగు కోడ్ ల ను తీసుకువచ్చి 29 చట్టాలను రద్దు చేస్తున్నారు.ఈకోడ్ ల కు వ్యతిరేకంగా ఈరోజు దేశ వ్యాప్తంగా కార్మిక లోకం ఉద్యమిస్తుందని అన్నారు.ఈకోడులు అమలు జరిగితే కార్మికులు కనీస వేతనాన్ని అడిగే హక్కు లేకుండా పోతుందని అన్నారు. కార్మికుల పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం బదులుగా 12 గంటల పని విధానం వస్తుందని, అంతేకాకుండా సంఘం పెట్టుకునే హక్కు కూడా కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కోడులకు వ్యతిరేకంగా జులై 9 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.ఈ సందర్భంగా సి ఐ టి యు జిల్లా కమిటీ సభ్యులు పైళ్ల గణపతిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ పుట్టక ముందుకే 18 వ శతాబ్దంలో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం కరమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ నరసింహ,ఉకుర్తి రాములు,ఎడవెల్లి ఎల్లమ్మయ్య,హమాలి కార్మిక సంఘం మండల అధ్యక్షులు.ఇన్ని జంగయ్య,నరసింహ వల్లయ్య,వీరస్వామి, అంజయ్య,తాళ్ల సత్తయ్య,లలిత,రేణుకప్పు,తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం ప్రవేశ పెట్టాం




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే-20: పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రోజున ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం - 2025 పై నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు. ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్) హర్కర వేణుగోపాల్. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఎమ్మెల్సీ టి.భాను ప్రసాద్ రావు తో .కలిసి పాల్గొన్న పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు.ఎలిగేడు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేసిన 150 మంది లబ్దిదారులకు మంత్రుల చేతుల మీదుగా మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూగత ప్రభుత్వ పెద్దలు సర్వ పూరితంగా నాలుగు గోడల మధ్య ఎవరి అభిప్రాయాలు తెలుసుకోకుండా ధరణి చట్టం తయారు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం దేశంలోని 18 రాష్ట్రాల్లోని 20 చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి వేల మంది ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని వారి కోరిక మేరకు భూ భారతి చట్టం తయారు చేశామని అన్నారు.రాష్ట్రంలోని ప్రతి రైతుకు భరోసా భద్రత కల్పించాలని ఎన్నో రాత్రులు శ్రమించి, మేధావులతో చర్చించి, ఒక్క రోజు అసెంబ్లీ జరిగిన పేదలకు మంచి జరగాలనే తపనతో భూ భారతి చట్టాన్ని తయారు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో రెవెన్యూ చట్టం తయారు చేయాలన్న ఆదర్శంగా ఉండే విధంగా భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం తయారు చేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందని అన్నారు.గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చి 3 సంవత్సరాలు గడిచిన రూల్స్ తీసుకుని రాలేదని, తమ ప్రభుత్వం భూ భారతి చట్టం రూల్స్ ప్రవేశపెట్టిందని, ఈ నిబంధనల ప్రకారం సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు. పెండింగ్ ఉన్న సాదా బైనామా చట్టం సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సాదా బైనామా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ధరణి చట్టంలో సాదా బైనామా గురించి అసలు పెట్టలేదని అన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని, ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని జూన్ 2 నాటికి నియమిస్తామని, ప్రతి సంవత్సరం రెవెన్యూ రికార్డు మాన్యువల్ గా రాసి గ్రామంలో నోటీసు బోర్డుపై అతికిస్తామని మంత్రి తెలిపారు.భూ సరిహద్దులతో పాటు భూమి కొలతలు పూర్తిగా ఉండే విధంగా రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పులు తీసుకొని వస్తామని అన్నారు. కర్ణాటక రాష్ట్ర విధానాలను ఆలోచిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాలలో 6 వేల లైసెన్స్ ప్రైవేట్ సర్వేయర్లను ఏర్పాటు చేస్తున్నామని , వీరికి మరో వారం రోజులలో శిక్షణ ప్రారంభం అవుతుందని అన్నారు. కోర్టులో లేని ప్రతి భూ సమస్య పరిష్కరించడమే భూ భారతి ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎవరి పేరుతో ఎంత భూమి ఉందో అది వారికే చెందేలా చూస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్ సమావేశం నిర్వహించి భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని స్పష్టంగా చెప్పారని, మొదటగా ప్రతి జిల్లాలో ఒక మండలం పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని, జూన్ రెండు లోపు ఎంపిక చేసిన పైలెట్ మండలాలలోని భూ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. గతంలో ధరణి వ్యవస్థలో ఏదైనా సమస్య వస్తే కోర్టు వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా తహసీల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు 5 అంచెల వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు.సిసిఎల్ఏ స్థాయిలో న్యాయం జరగకపోతే ప్రజలు కొత్తగా ఏర్పడిన ట్రిబ్యునల్ సంప్రదించ వచ్చని, రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన ట్రిబ్యునల్ లను ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి 10 లక్షల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలు గ్యాస్ సిలిండర్ సరఫరా, 20 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు 2 లక్షల రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్, రైతు భరోసా, డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీల పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పేదల కోసం అమలు చేశామని అన్నారు. అర్హులందరికీ త్వరలోనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నామని అన్నారు.యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తుందని అన్నారు. గిరిజనులకు ఉన్న పోడు భూములను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని 12 వేల 600 కోట్లతో చేపట్టిందని అన్నారురాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.గతంలో సాగు నీరు కోసం రైతులు పడే ఇబ్బందులకు ప్రతి రోజూ మాయం అయి పోవాలని చేసిన నాయకుల నేడు ప్రజాప్రతినిధిగా ఉండటం సంతోషంగా ఉందని అన్నారు. ఎస్సారెస్పీ డీ 83,డీ86 కాల్వల క్రింద పూర్తి స్థాయి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే విజయరమణ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. సుల్తానాబాద్, పెద్దపల్లి బైపాస్ రోడ్డు పనులు టెండర్లు పూర్తవుతున్నాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఎమ్మెల్యే విజయరమణ రావు పని చేస్తున్నారని తెలిపారు.భారతదేశ సరిహద్దుల అంశంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా తమ మద్దతు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు గారు స్పష్టం చేశారు. గతంలో ఇందిరా గాంధీ అమెరికా నాయకత్వం ఎదిరించి పాకిస్తాన్ ను యుద్ధంలో చిత్తు చేసి ప్రత్యేకంగా బంగ్లాదేశ్ దేశాన్ని సృష్టించామని, నేడు అమెరికా ఒత్తిడికి తలోగ్గి రాజీపడటం దురదృష్టకరమని మంత్రి తెలిపారు. దేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 57 వేల ఖాళీలను సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం భర్తీ చేసిందని అన్నారు. గత 10 సంవత్సరాల కాలంగా గత ప్రభుత్వం అసలు గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించక లేక పోయిందని అన్నారు. రైతులకు 2 లక్షల పంట రుణ మాఫీ, సన్న రకం వడ్లకు క్వింటాల్ 500 రూపాయలు బోనస్ , రైతు కూలీలకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొని వచ్చిందని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ.గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, వాటి పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొని వచ్చిందని అన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు పేరుతో రైతులకు చాలా నష్టం జరిగిందని అన్నారు. నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంవత్సరానికి దాదాపు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. మన పెద్దపల్లి జిల్లాలో గత పాలకుల హయాంలో లక్షా 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా నేడు ప్రజా ప్రభుత్వంలో 2023-24 లో 2 లక్షల 58 వేల 502 మెట్రిక్ టన్నులు, 2024-25 లో 2 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని అన్నారు.పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే రైతులకు ముందస్తుగా 48 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లింపు చేశామని , దీనికి కృషి చేసిన కలెక్టర్ , జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం విస్మరించిన పేదలకు నేడు ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ధూళికట్ట, ముప్పిరితోట, రాములపల్లె, నారాయణపూర్, కొత్తపల్లి, సుల్తాన్పల్లి గ్రామాలను కలుపుతూ రాజీవ్ రహదారి వరకు 12 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు మంజూరు చేశామని, రాబోయే 15 రోజులలో వీటి పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ఎలిగేడు మండలానికి నూతన పోలీస్ స్టేషన్ మంజూరు చేసుకున్నామని, 15 రోజులలో వీటి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాం: సీఎం చంద్రబాబు



**అమరావతి,:** రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్‌లో రైతాంగ సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. కేబినెట్ సమావేశంలో 45 నిమిషాలు వ్యవసాయరంగం, అన్నదాతల కష్టాలు, మార్కెటింగ్‌పై చర్చ జరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వివిధ పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివిధ పంటల ధరలపై ప్రభావం పడినట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. మిర్చి, పొగాకు, ఆక్వా, కోకో, చెరుకు, మామిడి వంటి పంట ఉత్పత్తుల ధరలు తగ్గడానికి గల కారణాలు వివరించారు. రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీ నిరంతర పర్యవేక్షించనుంది. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని సీఎం చెప్పారు.

## విచారణ కమిషన్ శీలాన్ని శంకించవలసిన పనిలేదు..

### ఎమ్మెల్సీ కీలక వ్యాఖ్యలు..!



**హైదరాబాద్, :** తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం లో తప్పులు జరిగాయనే కారణంతోనే కమిషన్ కొంత సమయం తీసుకుని నివేదిక రూపొందించిందని ఆయన అన్నారు. రాజకీయ కక్షతో కాదు, కేవలం అవినీతి చెందిన బాధ్యులను వెలికితీసే ఉద్దేశంతోనే విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీ కాంగ్రెస్‌లో వివక్షకు అవకాశం లేదు. వివేక్, వంశీలపై ఎలాంటి వివక్ష లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం విచారణలో కేసీఆర్, ఈటెల, హరీష్ రావులపై ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడం ముఖ్యమైన పరిణామంగా అభివర్ణించారు. వారు తప్పు చేయలేదంటే వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏంటీ? అని ప్రశ్నించారు. కాళేశ్వరంలో తప్పు జరిగిన విషయాన్ని కమిషన్ తేల్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. విచారణ కమిషన్ శీలాన్ని శంకించాల్సిన అవసరం లేదు.. సాంకేతిక సమాచారం కోసం ఆలస్యం జరిగిందని అన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే, శిక్ష తప్పదని.. కేసీఆర్ అమెరికా పారిపోవాలని చూస్తున్నట్టున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి పని చేయొద్దని, ప్రభాకర్ రావు వెళ్లినట్టు మీరు పోకండని హెచ్చరించారు. అలాగే కాళేశ్వరం నీటిని లిఫ్ట్ చేయడానికి కాదు, క్యాష్ లిఫ్టింగ్ చేయడానికే వాడుకున్నారు. తెలంగాణను దొంగల దొడ్డిగా మార్చారు అంటూ మండిపడ్డారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ఒక్క పిల్లర్ అయినా కూలిందా? కానీ కన్నెపల్లె పంపు హౌస్ ఎందుకు మునిగింది? అని నిలదీశారు. మరోవైపు ఈటెలపై కూడా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. ఈటెలను బీజేపీలోకి కావాలనే పంపించారా కేసీఆర్? బీఆర్ఎస్ లో అక్రమాలు చేసిన తర్వాతే ఆయన పార్టీ మారారన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు సీల్డ్ కవర్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. అలాగే కిషన్ రెడ్డి లాంటి బానిసలతోనే దేశానికి నష్టం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసారు. దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్ల పట్ల బీజేపీకి విధానం లేదని, రాహుల్ గాంధీ మీద మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదని ఆయన అన్నారు. బీజేపీ నేతలు ఎవరైనా దేశ స్వాతంత్రంలో పాల్గొన్నారా..? అంటూ ప్రశ్నించారు. పాకిస్తాన్ కు సమాచారం ఇచ్చిన కేంద్ర మంత్రి దేశ ద్రోహి కాదా..? కిషన్ రెడ్డి నల్లి కుట్ల లెక్క ఉంటాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. బీజేపీ కాదు.. బూతు జనతా పార్టీ, నీఛాతి నీచమైన బాషా.. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆయన అన్నారు.

## దాని వల్లే గుల్జార్ హౌస్ ప్రమాదం..

# నిర్ధారించిన అధికారులు..!





**హైదరాబాద్, :** హైదరాబాద్ లోని గుల్జార్ హౌస్ లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం అందరినీ కలచివేసింది. ఈ ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఓ భవనంలో సంభవించిన ఈ ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు అనేక దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. ప్రభుత్వం ఇప్పటికే హై లెవెల్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇక ప్రమాదం జరిగిన వెంటనే క్లూస్, ఫోరెన్సిక్ టీంలు ఘటన స్థలానికి చేరుకుని ఇంటి లోపలికి వెళ్లి విచారణ చేపట్టాయి. భవనంలో ప్రమాదానికి గల అసలు కారణాన్ని నిర్ధారించే ప్రయత్నంలో అధికారులు కీలక వివరాలను కనుగొన్నారు. అధికారుల వివరాల ప్రకారం, గుల్జార్ హౌస్ భవనంలో మొత్తం 14 ఏసీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఏదో ఏసీ యూనిట్‌లోని కంప్రెసర్ ఒక్కసారిగా పేలినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ పేలుడు తీవ్రమైన అగ్ని ప్రమాదానికి దారితీసిందని అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రతకు భవనం మొత్తం తునా తునకలైనట్లు వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ టూ అంతస్తులతో నిర్మించిన భవనం మొత్తం ప్రమాదంతో తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మూడంతస్తుల భవనంలోని వస్తువులు అన్నీ పనికి రాకుండా పోయాయి. గోడలన్నీ పగిలిపోయినట్లుగా, ఫ్లోర్లలో వేడి ప్రభావంతో బీటలు పడినట్లుగా గుర్తించారు. అలాగే టైల్స్, మార్బుల్స్ కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో భవన నిర్మాణ నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంప్రెసర్ పేలుడు ఎంత తీవ్రమైనా, భవనం అంతటి స్థాయిలో ధ్వంసం కావడం వెనుక నిర్మాణంలో లోపాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. 17 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఇప్పటికే హై లెవెల్ కమిటీ ఏర్పాటు చేసి పూర్తి నివేదిక కోరింది.


## కెసిఆర్, హరీష్ రావు, ఈటెలకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు


హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావుకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చారు. మాజీ సిఎం కెసిఆర్‌తో పాటు మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా జస్టిస్ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. 15 రోజుల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గత ఏడాది నుంచి పిసి ఘోష్ కమిషన్ విచారణ జరిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు పై కేంద్ర ప్రభుత్వ సంస్థలు కాగ్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్ఎ)లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికలను పిసి ఘోష్ కమిషన్ సున్నితంగా పరిశీలించి వాటిలోని అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని తుది నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సాంకేతిక, ఆర్థిక , విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి అఫిడవిట్ల తీసుకుని వాటి ఆధారంగా కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. దాదాపు వెయ్యి పేజీలకు పైగా నివేదికను జస్టిస్ పిసి ఘోష్ రూపొందించారని, ఈనెల మూడో వారంలో తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లుగా సమాచారం ముగ్గురిని పిలవకుండా నివేదిక ఇస్తే చెల్లుబాటు కాదని కమిషన్ అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వెళ్లరాదని కమిషన్ యోచించినట్లు సమాచారం.


# ఆలయాలపై కులాధిపత్యం ఇంకెన్నాళ్లు?













'దేవుని ముందు అందరూ మనుషులే. అందరూ సమానులే. కుల ప్రాతిపదికన ఎవరినీ వివక్షకు గురిచేయరాదు' అంటూ చెన్నై హైకోర్టు న్యాయమూర్తి భరత చక్రవర్తి ఒక కేసులో రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. గత ఏప్రిల్‌లోనే మతపరమైన ఒక కేసు విషయంలో తీర్పు వెలువరిస్తూ, కులం మతంలో ఎటువంటి భాగం కాలేదని, ఏ కులం కూడా హిందూ దేవాలయాల మీద యాజమాన్యానికి ప్రత్యేకమైన హక్కులు లేవని, న్యాయమూర్తి భరత చక్రవర్తి స్పష్టం చేశారు. చెన్నైలోని కర్ణీశ్వరర్ తిరుకోయిల్ దేవాలయం ట్రస్ట్ సభ్యులను ఒకే కులం వాళ్లను నియమించాలని, అందుకు భిన్నంగా ప్రభుత్వం అన్ని కూలాలకు అవకాశం కల్పించడానికి బహిరంగ ప్రకటన చేసిందని దాఖలు చేసిన పిటిషన్‌పైన విచారణ జరిపిన న్యాయమూర్తి కులం ప్రాతిపదికన అర్హతలను నిర్ణయించరాదని, ఆ మతానికి చెందిన ఎవరినైనా ఆ బాధ్యతల్లో నియమించవచ్చునని న్యాయమూర్తి చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఇందుకు గాను, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వివేకానంద, ప్రముఖ తమిళ కవి భారతి దాసన్, అదే విధంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యాఖ్యలను ఉదహరించారు. ఆత్మకు కులం, స్త్రీ, పురుష భేదం లేదని వివేకానంద సూక్తిని తన తీర్పులో ఉదహరించారు. అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ 'కులం మానసిక రుగ్మత మాత్రమేనని, దీనికి ఎటువంటి భౌతికపరమైన రూపం లేదని అన్న మాటలను ఇక్కడ పేర్కొన్నారు. అదే విధంగా మరొక కేసులో కూడా భరత చక్రవర్తి సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. భారత రాజ్యాంగం అందించిన శక్తివంతమైన స్ఫూర్తిని జస్టిస్ చక్రవర్తి చాలా బలంగా వినిపించారు. తమిళనాడులోని కుంద్రత్తూర్‌లోని అరుల్‌మిగ్ కామాచ్చి అమ్మన్ దేవాలయం నిర్వహన కోసం ఒక భక్తుడు విరాళం ఇవ్వడానికి ముందుకు వస్తే, ఆ దేవాలయం నిర్వాహకులు ఆయన అంటరాని కులానికి చెందిన వాడనే కారణంతో తీసుకోవడానికి నిరాకరించారు. ఇది చాలా విచిత్రంగా ఉంది. కానీ ఇది నిజం. ఇది కోర్టు వరకు చేరింది. ఈ విషయం హైకోర్టు జస్టిస్ భరత్ చక్రవర్తి స్పందిస్తూ 'ఈ దేశంలో వివిధ రూపాల్లో అంటరాని తనం కొనసాగుతున్నది. ఒక నిమ్న కులానికి చెందిన వ్యక్తి నుంచి విరాళం తీసుకోవడానికి నిరాకరించడమంటే ఇది కూడా అంటరాని తనాన్ని పాటించడమే. ఇది రాజ్యాంగంలో ఆర్టికల్ 17ను ఉల్లంఘించడమే' అంటూ రాజ్యాంగ విశిష్టతను, సర్వమానవ సమానతను జస్టిస్ చక్రవర్తి చాటి చెప్పారు. ఈ రెండు తీర్పులు ఈ దేశంలో హిందూ మతంలో ఉన్న అమానవీయ ధోరణులను బయటపెడుతున్నాయి. దేశంలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. గతంలో తెలంగాణలోని ఖమ్మం జిల్లాలోని ఒక గ్రామంలో ఎస్‌సి కులానికి చెందిన ఒక వ్యక్తి అందరితోపాటు గ్రామంలోని దేవాలయం నిర్మాణం కోసం కృషి చేశారు. అయితే ఆ దేవాలయం ప్రారంభోత్సవ సమయంలో ఆయనను దేవాలయంలోనికి రానివ్వలేదు. అదే విధంగా ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఆయన పేరును తొలగించారు. అయితే కొంత మంది హిందూ ధర్మ పరిరక్షకులు మాత్రం అందరూ సమామేనని, హిందువులందరూ బంధువులేనని నినాదాలు మాత్రం ఇంకా చెబుతూనే ఉన్నారు. ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అంటరానితనం మీద చాలా చోట్ల తన వ్యతిరేకతను తెలియజేశారు. తాగే నీటికి, దేవాలయ ప్రవేశానికి, శ్మశానంలో ఖననం, దహనం కోసం ఎటువంటి అంటరానితనం పాటించకూడదని స్పష్టం చేశారు. కానీ ఆచరణలో ఆయన మాటలను ఎవ్వరూ ఖాతరు చేయడం లేదు. ఆయన సంఘంలోని కింది స్థాయి నాయకులు కూడా ఆయన మాటలను పట్టించుకొన్నట్టు లేదు. ఇది ఒక దురదృష్టకరమైన అనుభవం. అయితే వివేకానంద, బాబా సాహెబ్ అంబేద్కర్ కొన్ని సార్లు గాంధీ లాంటి వాళ్లు అంటరానితనాన్ని తీవ్రంగా నిరసించారు. ముఖ్యంగా దేవాలయ పూజారులు కేవలం ఒకే కులానికి చెందిన వారు ఉండడం హిందూ మతానికి తీవ్రమైన నష్టం కాగలదని కూడా ప్రత్యేకించి బాబా సాహెబ్ అంబేద్కర్ స్పష్టం చేశారు. హిందూ మతానికి ఒక ప్రామాణిక గ్రంథం లేకపోవడం, ఎవరికి తోచిన విధంగా వాళ్ల మతాన్ని నిర్వచించడం, కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఒక ఐక్యత బంధం లేకుండా పోయిందని, అందువల్ల హిందూ మతాన్ని అంగీకరించి, దానిని అనుసరించి, అమలు చేసే వ్యక్తులను ఎంపిక చేసి, అందుకనుగుణంగా మత సాంప్రదాయాలను, సంస్కృతినివారికి బోధించి, దాని ప్రాతిపదిక మీద పూజారులను ఎంపిక చేయడం వల్ల అందరికీ హిందూ మతం మీద హక్కు ఏర్పడుతుందని బాబా సాహెబ్ అంబేద్కర్ తన కుల నిర్మూలన గ్రంథంలో పేర్కొన్నారు. అసలు కులం ఏర్పడడానికి, అది బలంగావేళ్లూనుకోవడానికి ఒకే కులాన్ని పూజారి హక్కులను కల్పించడమని, అందువల్ల ఆ కులం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, ఇతర ప్రజలను వివిధ రూపాల్లో వేర్వేరుగా నిర్వచించి ఒక సమూహంగా ఉండకుండా చేస్తుందని, అంబేద్కర్ చాలా స్పష్టంగా తన గ్రంథంలో పేర్కొన్నారు. చెడును కాదు, మంచిని కూడా మనం మననం చేసుకుందాం. హిందూ ధర్మ పెద్దలు ఆ మంచిని కనీసం అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారని ఆశిద్దాం. దక్షిణాసియా దేశాల్లో భారత దేశం తర్వాత ప్రముఖమైన దేశాల్లో ఇండోనేషియా ఒకటి. ఈ దేశంలో 90 శాతం జనాభా ముస్లిం మతాన్ని అనుసరిస్తున్నారు. 15వ శతాబ్దం వరకు ఆ దేశం కూడా హిందూ, బౌద్ధ సాంప్రదాయాలనే అనుసరించింది. ఆ తర్వాత ముస్లిం ఆక్రమణల తర్వాత ముస్లిం దేశంగా మారిపోయింది. అటువంటి మెజారిటీ ముస్లిం జనాభా కలిగిన ఇండోనేషియాలో ఒకే ఒక రాష్ట్రం బాలిమాబాం హిందూ రాష్ట్రంగా మిగిలిపోయింది. మన దేశం నుంచి చాలా మంది ప్రతి సంవత్సరం బాలికి వెళ్లి వస్తుంటారు. అందమైన ప్రదేశాలు, మంచి వాతావరణం, ప్రజల ఆదరణ మనల్ని కట్టిపడేస్తుంటాయి. అయితే అంతకన్న ముఖ్యమైనది మరొకటుంది. మన దేశం నేర్చుకోవాల్సింది అక్కడే ఉంది. అదే బాలి హిందూ సాంప్రదాయం. బాలిలోని ప్రజలందరూ హిందూ దేవుళ్లనే పూజిస్తారు. ముఖ్యంగా బ్రహ్మ, విష్ణు, శివున్ని ఆరాధిస్తారు. కాని అక్కడ మన దేశంలో ఉన్నట్టు కులాధిపత్యం లేదు. ఇన్ని వందల కులాలు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే తేడాలున్నాయి. అయితే మన దేశంలో ఉన్నంత దొంతర అంతరాలు కానరావు. ఈ విషయంపైన చాలా మంది సామాజిక వేత్తలు ఎన్నో పరిశోధనలు చేశారు. దేవాలయాల ప్రవేశం మీద ఆంక్షలు, ఒక కులం మీద మరొక కులం కుట్రలు, వివక్షలు లేవు. అన్నింటి కన్న ముఖ్యమైన అంశం ఈ దేశంలో అంటరానితనం లేదు. ఒకరిని ముట్టుకుంటే మైలపడిపోతామనే కుల రోగం అక్కడ లేదు. అంతకన్న ముఖ్యమైన అంశం పూజారి వ్యవస్థ. ఇక్కడ కేవలం బ్రాహ్మణులు మాత్రమే పూజారులుగా ఉండరు. హిందూ ధర్మ సాంప్రదాయాలు తెలిసిన ఎవరినైన ప్రజలు తమ పూజారిగా నిర్ణయిస్తారు. ఒక్క కులం గుత్తాధిపత్యం మతం మీద లేదు. అంతేకాకుండా ఏ పూజారి అయినా సాంప్రదాయాలను ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారు. ప్రజలందరికీ ఆ పూజారి మార్గదర్శకుడుగా, ఆదర్శనీయుడుగా ఉండాలి. ఇది బాలి ఒక రాష్ట్రాన్ని ఎటువంటి విభేదాలు లేకుండా ఒక సమూహంగా ఉండ గలుగుతుంది. అందువల్లనే మొత్తం దేశం ముస్లిం దేశమైనప్పటికీ బాలి కేవలం పది శాతం జనాభా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటున్నది. ఇది ఇలా ఉండడానికి, బాలి దీవి ప్రజలు గతంలో అనుసరించిన బౌద్ధం నుంచి స్థానిక ప్రాచీన మత సాంప్రదాయాల నుంచి ఎన్నో విషయాలను తర్వాతి తరాలు ఇముడ్చుకున్నారు. ఆ విధంగా హిందూ మతాన్ని అక్కడ సంస్కరించుకున్నారు. అదే విధంగా 1960 ప్రాంతంలో అక్కడ కమ్యూనిస్టు పార్టీ జరిపిన రాజకీయ పోరాటం కూడా హిందూ మతాన్ని మరింత మెరుగుపరుచుకున్నది. విషయాలన్నీ అక్కడి ప్రజల ఆచార, సాంప్రదాయాల్లో ఉన్నాయి. ఎంతో మంది సామాజిక నిపుణులు జరిపిన పరిశోధనల్లో ఉన్నాయి. బాలిలో ఉన్నది హిందూ మతం. భారతదేశంలో ఉన్నది హిందూ మతమే. రెండింటి మధ్య ఎంతకింత తేడా దీనికి కారణం ఒక్కటే, బాలి హిందూ ధర్మరక్షకులు తమను తాము సంస్కరించుకున్నారు. మనం మాత్రం ఇంకా అయిదు వేల కింది అంతరాలను ప్రవచించి ధర్మశాస్త్రాలను వల్లె వేసి మన చాందసవాదాన్ని మరింత పెంచుకుంటున్నాం. ఇప్పటికైనా మించిపోయింది లేదు. హిందూవులందరూ బంధువులే అని భావిస్తున్న వాళ్లందరూ ఎవరికి వారు అవలోకనం చేసుకొని ఆధునిక సమాజాన్ని నిర్మించుకోవడానికి ముందుకు వస్తే మంచిది.

# 'కారు' కోసం ఆ ముగ్గురి పోరు







తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బహుశా 2016లో భారత రాష్ట్ర సమితి నాయకురాలు కల్వకుంట్ల కవిత ఒక తెలుగు న్యూస్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ రాజకీయ వారసుడు ఎవరని అడిగితే ఇంకెవరు రామన్నే అని చెప్పారు. దాదాపు పదేళ్లు గడిచిపోయిన తర్వాత ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారు అయినట్టు కనిపిస్తున్నది. తన కుమారుడి డిగ్రీ పట్టా ప్రదానోత్సవంలో పాల్గొనేందుకు కవిత అమెరికా విమానం ఎక్కుతున్న సమయంలో తెలంగాణ రాజధానిలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది.. కవిత కొత్త పార్టీ పెడతారా, తండ్రిని ధిక్కరించి టిఆర్ఎస్ నుంచి బయటకు వస్తారా అని. పదేళ్ల కాలంలో ఎందుకు ఇంత మార్పు వచ్చింది? గత మాసంలో భారత రాష్ట్ర సమితి రజతోత్సవం సందర్భంగా ఆ పార్టీ కార్యాధ్యక్షుడు కేటీఆర్ పలు టీవీ చానళ్ళకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో 'తెలంగాణ రాష్ట్రం సాధిస్తే చాలు ఇంకేమీ అవసరం లేదు అనుకున్నాను, మంత్రి పదవి కూడా ఆశించలేదు, నేను అమితంగా వ్యతిరేకించే కాంగ్రెస్ లో గనుక ఆనాడు మా నాయన టిఆర్ఎస్ ను విలీనం చేసి ఉంటే రాజకీయాల్లో కూడా ఉండేవాడిని కాను. ఆ మాట సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పడంకోసం ఆమె నివాసంలోకి వెళు తుండగానే హరీశ్ రావుకు, నా భార్యకు స్పష్టంగా చెప్పాను' అన్న కేటీ రామారావు ఇప్పుడు ఎందుకు కేసీఆర్ ఏకైక వారసుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చర్చ జరుగుతున్నది. అధికారంలో ఉన్నప్పుడే భారత రాష్ట్ర సమితిలో కెసిఆర్ వారసత్వంకోసం మూడు స్తంభాలాట మొదలయింది. కేటీ రామారావు, హరీశ్ రావు, కవిత మధ్య పొరపొచ్చాలకు సంబంధించిన వార్తలు మీడియాకు మృష్టాన్న భోజనం అయిన విషయం తెలిసిందే. అయితే దాదాపు అన్ని సందర్భాల్లో ముగ్గురూ 'కేసీఆరే మా నాయకుడు, మేమంతా ఆయన విధేయులం' అని చెబుతూ వచ్చినా తాజా పరిస్థితి మాత్రం ఆ ముగ్గురి అంతరంగాలను ఆవిష్కరిస్తున్నట్టే కనిపిస్తున్నది. నిన్న మొన్నటిదాకా 'కేసీఆర్ నాయకుడు.. ఆయన నేతృత్వంలోనే నేను ఒక సైనికుడిగా పని చేస్తాను' అని చెబుతూ వచ్చిన మాజీ మంత్రి, పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న సీనియర్ నాయకుడు హరీశ్ రావు హఠాత్తుగా కేటీ రామారావుకు నాయకత్వం అప్పగించినాసరే, కెసిఆర్ ఆదేశాలమేరకు ఆయన కింద కూడా పనిచేయడానికి తాను సిద్ధమని చెప్పడం పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీకి విధేయుడు, మరీ ముఖ్యంగా నాయకుడిపట్ల అపారమైన భక్తిప్రపత్తులు కలిగిన హరీశ్ రావు ఎందుకు స్వరం మార్చినట్టు? దీని వెనుక మతలబు ఏమిటి? అని చర్చ జోరందుకున్న సమయంలో కేటీ రామారావు స్వయంగా హరీశ్ రావు ఇంటికి వెళ్లి దాదాపు మూడు గంటలపాటు సమాలోచనలు జరపడం మరింత చర్చనీయాంశం అయింది. వారి మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్నది ఊహకు అందని విషయం ఏమీ కాదు. కేసీఆర్ వారసుడిగా ఆయన కుమారుడే ఉంటాడు అనడానికి, అధినాయకుడు కూడా అదే కోరుకుంటాడు అనడానికి నిదర్శనంగా ఇప్పటికే కొన్ని సంఘటనలు జరిగాయి. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ త్వరలో కేటీఆర్ ని ముఖ్యమంత్రిగా ప్రకటించబోతున్నారనే వార్తను పార్టీలోని రెండవ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రజల స్పందనకోసం ప్రచారంలోకి తెచ్చారు. దానికి సరైన స్పందన రాకపోగా కొంత వ్యతిరేకత ఉందని గ్రహించిన కేసీఆర్ మళ్ళీ తానే దాన్ని సరిదిద్దుకుంటూ 'నేను ఉన్నంతకాలం నేనే ముఖ్యమంత్రిని, నేనే నాయకుడిని' అని చెప్పుకున్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక గత మాసంలో రజతోత్సవ వేడుకల సందర్భంగా కూడా కేటీ రామారావే పార్టీ తదుపరి నేత అనే సంకేతాలు వెళ్లేట్టుగా సంఘటనలు జరిగాయి. తొలుత హరీశ్ రావుకి ఉత్సవాల నేతృత్వ బాధ్యతలు అప్పగించిన కేసీఆర్ మధ్యలో మనసు మార్చుకుని ఆ బాధ్యతను పూర్తిగా కేటీ రామారావు అప్పగించినట్టుగా బయటకు కనిపించే విధంగా పరిణామాలు మారుతూ వచ్చాయి. రజతోత్సవ వేడుకల వేదిక మీద కూడా కెసిఆర్ తన కుమార్తె కవితకుగానీ, హరీశ్ రావుకుగానీ ప్రాధాన్యత లేకుండా చేయడం చర్చనీయాంశం అయింది. అయినా కెసిఆర్ ఇంకా క్రియాశీలక రాజకీయాల్లో ఉండగానే ఎందుకని వారసత్వ చర్చ వస్తున్నది? ఇటీవల ఆయన కొడుకు, కూతురు ఇద్దరూ రాజకీయ సంబంధమైన కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు వారి మద్దతుదారులు 'సీఎం సీఎం' అంటూ నినదించినా అగ్రనాయకుడు ఉండగా అలా కోరుకోవడం సరైనది కాదని నివారించినట్టుగా కనిపించదు. మొన్నటికి మొన్న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురం శివారులో నాంచారమ్మ కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు జరిపిన కవిత అక్కడ నాంచారమ్మ అమ్మవారి వేషధారణలో వచ్చిన బాలికలతో సోది చెప్పించుకున్నారు. 'భవిష్యత్తులో మీరే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతార'ని చిన్నారులు అనడంతో ఆ మాటలను కవిత చిరునవ్వుతో ఆలకించారు కానీ వారించే ప్రయత్నం ఏమి చేయలేదు. ఇటీవలి కాలంలో కవిత హాజరవుతున్న పలు సభల్లో ఆమెను ఉద్దేశించి గుంపులో నుండి 'సీఎం సీఎం' అనే నినాదాలు వినిపించినా ఆమె ఆక్షేపించలేదు. ఇదే పరిస్థితి కేటీ రామారావు సభల్లో కూడా కనిపిస్తుంది. పోరాడి రాష్ట్రం సాధించిన నాయకుడు ఇంకా ఆరోగ్యంగా ఉండగా, రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండగా ఈ నినాదాలు ఏమిటని గట్టిగా మందలించింది లేదు. ఇక్కడ ఒక పోలిక తీసుకురావచ్చు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత ఎన్నో ఏళ్లకు తాను ఆయన వారసురాలిని అంటూ, ముఖ్యమంత్రిని అవుతానంటూ ఆయన కూతురు షర్మిల బయలుదేరారు. తన సోదరుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆనాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు రాజకీయంగా, ఆర్థికంగా కూడా ఇవ్వవలసినంత భాగస్వామ్యం ఇవ్వనందుకు ఆమె అలిగి బయటకు వచ్చి రాజకీయాలు చేసే ప్రయత్నం చేశారు. సొంత పార్టీ పెట్టి ఘోరంగా విఫలమై, కాంగ్రెస్ పార్టీ లో చేరి ఆంధ్రప్రదేశ్ లో ఆ పార్టీ అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారు. అక్కడ ఇవన్నీ వైయస్సార్ మరణానంతరం జరిగా యి. ఇక్కడ కేసీఆర్ క్రియాశీలకంగా ఉన్న కాలంలోనే కవిత తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారంటే సహజంగానే చర్చ జరుగుతుంది. రామన్నే కేసీఆర్ వారసుడు అన్న దగ్గరనుండి రాజకీయ వారసత్వంలో వాటా కోరుకునే వరకు లేదా వారసురాలిని కావాలని కోరుకునేవరకు కవితలో వచ్చిన మార్పు ల వెనక కారణాలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ సమయం లో కేసీఆర్ సంతానమిద్దరూ హరీశ్ రావు తర్వాతనే రాజకీయరంగ ప్రవేశం చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ జాగృతి పేరిట పార్టీ కార్యక్రమాలకు ఆమె కొంత ఊపునిచ్చిన మాట వాస్తవం. అందుకు ప్రతిఫలంగా నిజామాబాద్ నుంచి లోకసభ సభ్యురాలుగాఎన్నికై రెండవ పర్యాయం స్వయంకృతాపరాధంవల్ల ఓడిపోయారు. అయినా నాయకుడు ఆమెను శాసనమండలికి పంపించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలి కాలంలో ముఖ్యంగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా తీహార్ జైలుకు వెళ్లి వచ్చిన తరువాత కొన్ని మాసాలకు తిరిగి ప్రజల్లోకి వచ్చి వివిధ విషయాల మీద మాట్లాడుతున్న కవిత పార్టీలో తనకు అన్యాయం జరుగుతున్నదనే భావనలో ఉన్నారు. అది పలుమార్లు ఆమె నోటనే బయటపడింది కూడా. నిజానికి ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తాను ఆరు మాసాలు జైలుకు వెళ్లి వచ్చినా పార్టీ అగ్రనాయకత్వంనుండి సరైన స్పందన లేదని అభిప్రాయంతో ఉన్నారు. ఆ మేరకు ఆమె పార్టీ పరిణామాలపట్ల, తనపట్ల పార్టీ వ్యవహరిస్తున్న తీరు విషయంలో కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ తండ్రికి లేఖ రాసినట్టుగా చర్చ జరుగుతున్నది. లేఖలో ఏమున్నది అనే విషయం మనకు తెలియకపోయినా కొన్ని సందర్భాలలో ఆమె తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించడం పార్టీ నాయకత్వానికి.. ముఖ్యంగా పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కు, ఆయన వారసుడిగా ప్రచారంలో ఉన్న కేటీ రామారావుకు కొరుకుడు పడని విషయాలన్నది స్పష్టం. 'భౌగోళిక తెలంగాణ సాధించుకున్నాం కానీ సామాజిక తెలంగాణ కోసం ఇంకా పోరాడాల్సి ఉంది' అని కవిత బహిరంగంగా మాట్లాడడం అంటే తన తండ్రి పాలనలో వివిధ వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగలేదని భావిస్తున్నట్టే కదా. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమాన్ని పార్టీ బహిష్కరించినా, కేసీఆర్ సహా నాయకులెవరూ అందులో పాల్గొనకపోయినా కవిత అందులో పాల్గొనడం నాయకత్వానికి కంటగింపుగానే కనిపించింది. అమెరికా వెళ్లే ముందు కవిత తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కూడా తనపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, వాళ్ళు ఎవరో తనకు తెలుసు అని చెప్పడం గమనార్హం. ఇది తన సోదరుడిని లేదా హరీశ్ రావును ఉద్దేశించి మాట్లాడిన విషయాలని అర్థం అవుతూనే ఉంది. వయసురీత్యా, ఆరోగ్యరీత్యా లేదా జాతీయ రాజకీయ అవసరాల దృష్ట్యా కెసిఆర్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినట్లయితే రాష్ట్ర పార్టీ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారో అనే విషయంలో తగాదా జరగడం సహజం. ఇంతకుముందే చెప్పుకున్నట్టుగా వారసత్వ తగాదాలు ఒక నాయకుడి నిష్క్రమణ అనంతరం జరుగుతాయి. చాలా కొద్ది సందర్భాలలోనే బహుళ ప్రజాదరణ కలిగిన నాయకుడు బ్రతికి ఉండగానే తిరుగుబాటు చేసి పదవీచ్యుతుడిని చేయడం చూసాం. అటువంటి సందర్భాలు భారతదేశ రాజకీయాల్లో తక్కువ. ఎన్టీ రామారావుకు జరిగిన వెన్నుపోటు అందుకు ఉదాహరణ. ఎంజీ రామచంద్రన్ చనిపోయాకే జయలలిత ఆయన రాజకీయ వారసత్వంకోసం పోటీపడి గెలిచారు. జవహర్లాల్ నెహ్రూ మరణానంతరం మరో ప్రధానమంత్రి కొద్దిరోజులు బాధ్యతలు నిర్వహించిన తర్వాతే శ్రీమతి ఇందిరాగాంధీకి తండ్రి రాజకీయ వారసత్వం దక్కింది. మన ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్లో స్వతంత్రంగా ఎదిగి వచ్చినా రాజశేఖర్ రెడ్డి కుమారుడు అనే అపారమైన ప్రజాభిమానాన్ని చూరగొంటూ ఉన్నారు. రాష్ట్రాన్ని సాధించుకుని ప్రజల మెప్పు పొంది అధికారంలోకి వచ్చి, పది సంవత్సరాల తర్వాత ప్రజలు తిరస్కరిస్తే ప్రతిపక్షంలో కూర్చున్న పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే ఇప్పుడు చేయాల్సింది వారసత్వం కోసం తగాదాపడటం కాదు. నెపం ప్రజల మీద నెట్టకుండా ఓటమికి కారణాలు విశ్లేషించుకుని జరిగిన తప్పులను సరిచేసుకొని ఆ తప్పులు మళ్ళీ జరగవని చెప్పి ప్రజలను మెప్పించి ఓట్లు అడిగితే ఫలితం ఉండొచ్చు. రాజకీయ వ్యూహరచనలో, ఎత్తుగడలలో తలపండిన కేసిఆర్ ఈ ముగ్గురినీ సముదాయించో, కఠినంగా వ్యవహరించో దారికి తెచ్చుకొని ఐక్యంగా అధికార కాంగ్రెస్ మీద పోరాటం చేస్తారా లేక కాగల కార్యం గంధర్వులే తీరుస్తారులే అని చోద్యం చూస్తారా?

## సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?: జగన్




అమరావతి: టిడిపికి బలం లేకున్నా ఉప ఎన్నికల్లో గెలిచినట్టు ప్రకటించుకుంటున్నారని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. నరసరావుపేట, కారంపూడిలో గెలిచామని ప్రకటించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ..కుప్పం మొదలు ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితని, రామగిరి ఉప ఎన్నికలో అరాచకాలకు అంతులేదని మండిపడ్డారు. సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?నని జగన్ ప్రశ్నించారు. పోలీసులను పెట్టి వైఎస్ఆర్ సిపి సభ్యులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలిలో తమ పార్టీ గట్టిగా నిలబడి గెలిచామని చెప్పారు. ఏ ప్రభుత్వంపైనైనా వ్యతిరేకత రావాలంటే సమయం పడుతుందని, కూటమి ప్రభుత్వంపై నెలల్లోనే విపరీతమైన వ్యతిరేకత ఉందని తెలియజేశారు. తనకన్నా ఎక్కువ చేస్తానని చంద్రబాబు హామి ఇచ్చారని, జగన్ ఇచ్చేవన్నీ ఇస్తాను, అంతకంటే ఎక్కువ ఇస్తానన్నారని పేర్కొన్నారు. కానీ వాటన్నింటినీ తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. "మన ప్రభుత్వంలో మేనిఫెస్టోతో గడప గడపకూ కార్యక్రమం కింద ప్రతి ఇంటికి వెళ్లాము. మనం చేసిన మంచి ఎక్కడికీ పోదు." అని అన్నారు. 10 శాతం ప్రజలు చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రభుత్వాన్ని ఫుట్బాల్ లా తంతారని ధ్వజమెత్తారు. హామీల అమలుపై గట్టిగా నిలదీస్తారనే భయం వారికి ఉందని, మాట ఇవ్వడమంటే వెన్ను పోటని బాబు నిరూపించారని విమర్శించారు. పేదవాడి వైద్యం గురించి ఆలోచించే పరిస్థితి లేదని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని చెప్పారు. రూ.3600 కోట్లు పెండింగ్ లో పెట్టారని, ఆరోగ్య ఆసరాలను పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. వైద్యం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడిందని జగన్ స్పష్టం చేశారు.

## హిందూ-ముస్లిం రాజకీయాలే.. అన్ని సమస్యలకు మూల కారణం: కెజ్రీవాల్



న్యూఢిల్లీ: గత 75 సంవత్సరాలుగా ప్రధాన పొలిటికల్ పార్టీలు ఆచరిస్తున్న హిందూ-ముస్లిం రాజకీయాలే దేశంలోని అన్ని సమస్యలకు మూల కారణమని ఢిల్లీ మాజీ సిఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మంగళవారం పార్టీ విద్యార్థి విభాగం- అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. "మన దేశం చాలా సమస్యలతో సతమతమవుతోంది. ప్రజలకు ఆహారం, విద్య అందుబాటులో లేదు. ఇలా ఎందుకు జరుగుతోంది?.. ఎందుకంటే బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు గత 75 సంవత్సరాలుగా రాజకీయాల్లో మాత్రమే మునిగిపోయాయి" అని విమర్శించారు. "ఈ పార్టీలు మన పాఠశాల పిల్లలకు హిందూ-ముస్లిం గురించి మాత్రమే బోధిస్తున్నాయి. మన దేశంలో సమస్యలకు ఇదే మూల కారణం" అని ఆయన అన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం.. దేశ రాజధానిలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. నగరంలో సుదీర్ఘ విద్యుత్ కోతలపై ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. "ఇప్పుడు ఢిల్లీలో మూడు నుండి నాలుగు గంటల పాటు విద్యుత్ కోతలు ఉన్నాయి. ఇలా గతంలో జరగలేదు. మూడు నెలల్లోనే, వాళ్లు(బిజెపి) ఢిల్లీలో విద్యను నాశనం చేయడం ప్రారంభించారు" అని ఆయన మండిపడ్డారు. ఆప్ పదేళ్ల పాలనలో ప్రైవేట్ పాఠశాల మాఫియా ఫీజులు పెంచడానికి అనుమతించలేదని ఆయన చెప్పారు. ఎన్నికలను పూర్తి నిజాయితీతో ఎదుర్కోవచ్చని ఆప్ నిరూపించిందని కేజ్రీవాల్ అన్నారు. ASAP గురించి మాట్లాడుతూ.. ఫోరం కింద దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో విద్యార్థి సాంస్కృతిక బృందాలు ఏర్పడతాయని ఆయన చెప్పారు.

## తిరువూరు మున్సిపల్ ఎన్నిక హైకోర్టు కీలక ఆదేశాలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్ టిఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ కౌన్సిలర్లకు అరగంటలో భద్రతా ఏర్పాట్లు చేయాలని హైకోర్టు ఆదేశించింది. డిసిపి స్థాయి అధికారితో కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని వివరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టుకు విన్నవించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పోలీసులు పాటించడం లేదని కోర్టుకు న్యాయవాదులు తెలిపారు. తక్షణమే ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాలని హైకోర్టు తెలిపింది. మంగళవారం ఉదయం నుండి తిరువూరులో టిడిపి శ్రేణులు అరాచకం సృష్టిస్తున్నాయి. వైసిపి కౌన్సిలర్లను ఎన్నికలకు రాకుండా అడ్డుకోవడానికి టిడిపి కుట్రలు చేస్తోందని వైసిపి ఆరోపణలు చేస్తుంది. వైసిపి కౌన్సిలర్లపై దాడి చేయడానికి టిడిపి కుట్రలు పన్నుతోందన్నారు. తిరువూరు నగర పంచాయతీ కి సంబంధించి మొత్తం 20 మంది కౌన్సిలర్లులకు ఓటు హక్కు ఉండగా ఎక్స్ అఫీషియల్ హోదాలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి మొత్తం 21 ఓట్లు ఉన్నాయి. టిడిపికి ముగ్గురు కౌన్సిలర్లు ఉండగా, వైసిపికి చెందిన కౌన్సిలర్లలో కాకర్లమూడి సుందర్ కుమార్, పసుపులేటి శరత్ బాబు తెదేపాలో చేరారు. మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు దారా పద్మా నీలిమ, గతం కస్తూరిబాయి కూడా తెలుగుదేశం పార్టీకి బయట నుండి మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. దీంతో టిడిపి 9, వైసిపికి 12 ఓట్లు ఉన్నాయి. వైసిపికి చెందిన కౌన్సిలర్ రమాదేవి విదేశాల్లో ఉండడంతో వైసిపి బలం 11కి పడిపోయినట్టు సమాచారం.

## గుడ్ న్యూస్.. మెట్రో చార్జీలు తగ్గింపు



హైదరాబాద్: నగర వాసులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల మెట్రో చార్జీలను భారీగా పెంచిన యాజమాన్యం కాస్త దిగొచ్చింది. తాజాగా మెట్రో రైలు సంస్థ టికెట్ ధరలను సవరించింది. మంగళవారం మెట్రో చార్జీలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన టికెట్ ధరలను మే 24వ తేదీ నుండి అమలులోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. కాగా, ఇటీవల కనిష్టంగా ఉన్న రూ.10 టికెట్ ధరను 12 రూపాయలకు పెంచింది. గరిష్టంగా ఉన్న 60 రూపాయల టికెట్ ధరను 75 రూపాయలకు పెంచిన సంగతి తెలిసిందే.

## గజ రాజులకూ పేర్లుంటాయ్



### ఏనుగులూ పేర్లతో పిలుచుకుంటాయని గుర్తించిన శాస్త్రవేత్తలు

### ప్రత్యేక శబ్దంతో తమ గుంపులోని ఏనుగులకు సిగ్నల్స్

### మనుషుల మాదిరిగానే ఏనుగులకు ప్రత్యేక భాష ఉన్నట్టు గుర్తింపు

### అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

అమరావతి: మనం ఒకరినొకరు పేర్లతో పిలుచుకోవడం సహజం. ఇలా పేర్లు పెట్టుకుని సంబోధించుకోవడానికి మాట్లాడటం రావాలి. అందుకు ఓ భాష కూడా కావాలి. అది మనుషులకు మాత్రమే సాధ్యమనే భావన నిన్నమొన్నటి వరకు భావించేవారు. కానీ.. కొన్ని రకాల వన్యప్రాణులు కూడా మాట్లాడుకుంటాయని.. వాటికి కూడా భాష ఉంటుందని వివిధ పరిశోధనల్లో తేలింది. ఇప్పుడు అలా మాట్లాడుకునే వన్య ప్రాణుల్లో ఏనుగులు కూడా ఉన్నాయని తాజాగా గుర్తించారు. అడవుల్లో జీవించే ఏనుగులు పేర్లతో పిలుచుకుంటాయని తేలింది. అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీకి చెందిన రీసెర్చర్ మైకేల్ బార్టో నేతృత్వంలోని బృందం కెన్యాలోని ఆఫ్రికన్ ఏనుగులపై జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ఏనుగులు చేసే రకరకాల శబ్దాలను శాస్త్రవేత్తలు రికార్డు చేసి వాటి ప్రవర్తనను గమనించారు. అవి తమ గుంపులోని ఇతర ఏనుగులను గుర్తించడానికి ప్రత్యేకమైన, తక్కువ ఫ్రీక్వెన్సీ గల శబ్దాలను (ఇన్‌ఫ్రా సౌండ్) ఉపయోగిస్తాయని కనుగొన్నారు. ఈ శబ్దాలు మనం పేర్లుగా భావించే వాటితో సమానమని తేలింది. ఒక ఏనుగు తన సమూహంలోని మరో ఏనుగును పిలవాలనుకుంటే ఒక నిర్దిష్టమైన శబ్దాన్ని చేస్తుంది. అది ఆ ఏనుగు మాట్లాడాలనుకున్న మరో ఏనుగుకు మాత్రమే సంబంధించిన శబ్దం అని స్పష్టమైంది. ఒక్కో ఏనుగుకు ఒక్కో ప్రత్యేకమైన శబ్దం ఉంది. ఈ శబ్దాలు కామన్‌గా ఇతర అన్ని జంతువులు ఒకే రకంగా చేసేలా లేకపోవడం ఈ పరిశోధనలో గుర్తించిన కీలకమైన అంశం.

ఏఐ టెక్నాలజీతో శబ్దాల విశ్లేషణ

శాస్త్రవేత్తలు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఏనుగుల శబ్దాలను విశ్లేషించారు. పరిశోధకులు ఒక గుంపులోని ఏనుగులను గుర్తించేందుకు పేర్లు పెట్టారు. అందులో ఒక ఏనుగుకు 'మాంబా' అని పేరు పెట్టి దాన్ని నిరంతరం గమనించారు. 'మాంబా' ఒక నది దగ్గర నీళ్లు తాగుతుండగా, గుంపులోని మరో ఏనుగు దాన్ని పిలవడానికి ఒక ప్రత్యేకమైన గుంద్రని శబ్దాన్ని చేసింది. ఆశ్చర్యకరంగా 'మాంబా' మాత్రమే ఆ శబ్దానికి స్పందించి తల ఎత్తి ఆ దిశగా చూసింది. మిగతా ఏనుగులు ఆ శబ్దాన్ని పట్టించుకోలేదు. దీనిద్వారా ఏనుగులు వ్యక్తిగత పేర్లను ఉపయో గిస్తాయని నిర్ధారణ అయింది.

అసాధారణ మేధస్సు గజరాజుల సొంతం

సాధారణంగా అడవి జంతువులు ఒకే రకమైన అరుపులు, శబ్దాల ద్వారా సంభాషించుకుంటాయి. ఈ శబ్దాలన్నీ కామన్‌గా ఉంటాయి. ప్రత్యేకంగా ఒక్కో దానికి ఒక్కో రకమైన శబ్దాలు ఉండవు. కానీ.. ఏనుగులు ప్రత్యేకంగా మనుషుల మాదిరిగానే సంభాషించుకునేలా శబ్దాలు చేసుకోవడం కొత్త విషయం. అవి ఒక శబ్దాన్ని చేయడంతోపాటు అది ఎవరు చేశారో, ఎవరి కోసం చేశాయో కూడా గుర్తించగలుగుతున్నాయి. అంటే వాటికి బుద్ధితో ఆలోచించే సామర్థ్యం ఉన్నట్టు స్పష్టమైంది. ఏనుగులు బలమైనవే కాదు.. అసాధారణమైన మేధస్సు కలిగిన సామాజిక జీవులని తాజా అధ్యయనంలో వెల్లడైంది.

డాల్ఫిన్లు, చిలుకలకు ప్రత్యేక భాష

ఇప్పటివరకు డాల్ఫిన్లు, చిలుకలు ఒకదాన్ని ఒకటి గుర్తించడానికి శబ్దాలను చేస్తాయని భావించేవారు. ఒక డాల్ఫిన్ తన సమూహంలోని మరో డాల్ఫిన్ చేసే స్వరాన్ని అనుకరించి దాన్ని పిలుస్తుంది. కానీ.. ఏనుగులు ప్రత్యేకమైన శబ్దాలను ఉపయోగిస్తుండటం.. అవి మనుషుల సంభాషణ పద్ధతికి చాలా దగ్గరగా ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఏనుగులు తమ సమూహంలో ఉన్న ఇతర ఏనుగులతో బలమైన బంధాలను ఏర్పర్చుకుంటాయి. కలిసి ప్రయాణించడం, కలిసి ఆహారం సేకరించడం, శత్రువుల నుండి ఒకదానిని మరొకటి రక్షించుకోవడం ద్వారా తమ బంధాన్ని మరింత దృఢంగా మార్చుకుంటాయి. అయితే వాటికి ఒక శబ్దాల భాష ఉన్నట్టు తాజాగా బయటపడటంతో అవి మనుషులతో చాలా దగ్గరగా ఉన్నట్టు తేలింది. 'ఏనుగులు మనం ఊహించిన దానికంటే ఎక్కువ సంక్లిష్టతను కలిగి ఉన్నాయి. వాటి సామాజిక నిర్మాణం, సంభాషణ పద్ధతులు మనుషులతో సమానంగా ఉన్నాయి' అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఒక శాస్త్రవేత్త తెలిపారు.

## బాలికల విద్యకు ప్రేమ్‌జీ చేయూత

మనదేశంలో ఆడపిల్లలు చదువుకోవాలంటే ప్రధాన సమస్య డబ్బు. ప్రాథమిక విద్య పూర్తి కాగానే.. ఆర్థిక స్థోమత లేక, పెళ్లీడు రాగానే పెళ్లిచేసి పంపించేస్తే సరిపోతుందని.. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆలోచిస్తుంటారు. ఈ నేపథ్యంలో బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. అయినా ఇప్పటికీ లక్షల మంది బాలికలు బడికి పోవడం లేదు. అలాంటి అమ్మాయిల ఉన్నత విద్యకు చేయూత ఇచ్చేందుకు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ముందుకొచ్చింది. వచ్చే మూడేళ్లలో ఏటా రూ.750 కోట్ల చొప్పున బాలికల కాలేజీ చదువుల కోసం భారీ ఎత్తున రూ.2,250 కోట్లు వెచ్చించనుంది.

### అజిమ్ ప్రేమ్ జీ..

దేశంలోని అపర కుబేరుల్లో ఒకరు. ఆయన స్థాపించిన విప్రో కంపెనీ అంటే విలువలకు పెట్టిందిపేరు. అజిమ్ ప్రేమ్‌జీ అనగానే దాతృత్వం గుర్తుకొస్తుంది. 2019లో విప్రో కంపెనీలో తన వాటా 7.6 బిలియన్ డాలర్లను తన అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు ఇస్తున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 2023 జనవరి వరకు సేవా కార్యక్రమాల ద్వారా రూ.2,40,000 కోట్లు ఖర్చు చేసినట్లు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వెల్లడించింది. కరోనా సమయంలో ఆక్సిజన్ బెడ్లు, ఐసీయూ బెడ్లు, ఇతర సాయం కోసం సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేశారు. కర్ణాటకలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 2024 నుంచి.. వారంలో నాలుగు రోజులు ఉచితంగా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు. దీనిద్వారా 55 లక్షల విద్యార్థులకు గుడ్లు అందించేందుకు ఏడాదికి రూ.800 కోట్ల వ్యయం చేస్తున్నారు. చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. ఇంత దొడ్డ మనసున్న ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఇప్పుడు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

### 2.5 లక్షల మందికి..

అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఎంపికైన మొత్తం 2,50,000 మంది అమ్మాయిలకు సంవత్సరానికి రూ.30వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తారు. అంటే సంవత్సరానికి రూ.750 కోట్లు.. మూడేళ్లకు రూ.2250 కోట్లు మేర బాలికల ఉన్నత విద్య



కోసం అజిమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ వెచ్చించనుంది. తద్వారా దేశంలోలాభాపేక్షలేని సంస్థ ద్వారా అమలవుతున్న భారీ ప్రత్యక్ష నగదు బదిలీ పథకం (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్ - డీబీటీ) గా ఇది నిలవనుంది.

### అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, 12వ తరగతి పూర్తి చేసుకున్న అమ్మాయిలు అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ కాలేజీ లేదా యూనివర్సిటీలో రెగ్యులర్ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో చేరిన అమ్మాయిలు కూడా దరఖాస్తుకు అర్హులే. ఇలా ఆయా కోర్సులో చేరి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకూ ఏటా రూ.30వేల ఉపకారవేతనం అందుతుంది. ఇలా మూడేళ్ల డిగ్రీ లేదా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకునే వరకూ ప్రతి విద్యార్థినికి మొత్తం రూ.90వేల ఉపకార వేతనం లభిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్‌లో ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకు అవసరమైన పత్రాలు.. పదో తరగతి, 12వ తరగతి మార్కుల పత్రాలు, డిగ్రీ లేదా డిప్లొమా కాలేజీలో అడ్మిషన్ లెటర్/బోనఫైడ్ సర్టిఫికెట్, ఫీజు రిసిప్ట్, పాస్‌పోర్టు ఫొటోలు.

### ప్రేమ్‌జీ ఫౌండేషన్

విప్రో సంస్థ వ్యవస్థాపకుడు అజిమ్ ప్రేమ్‌జీ ఆధ్వర్యంలో 2001లో అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏర్పాటైంది. దాతృత్వ కార్యక్రమాల ద్వారా దేశాభివృద్ధిలో పాల్పంచుకోవాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన లాభాపేక్షలేని సంస్థ ఇది. ఈ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి తదితర రంగాల్లో సేవలు అందిస్తున్నారు. 'బాలికలు ఉన్నత విద్యను పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌లను ఇస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన బాలికలు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. ఉన్నత విద్యను పూర్తిచేసుకోవడంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే బాలికలు అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ ద్వారా వారు తమ చదువులు కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. ఉన్నత విద్యావంతులైన మహిళలు తమ జీవితంలో సాధికారతను సాధించగలరు'అంటారు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహరా.

### ఉన్నత విద్యలో చేరేది మూడొంతులే..

ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం దేశంలోని 15 లక్షల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 25 కోట్ల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో సగం మంది ప్రభుత్వ బడుల్లోనే చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో సగటు చేరికలు (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) 93 శాతం ఉంటే.. ఆరో తరగతికి వచ్చేసరికి అది 77.4 శాతానికి డిపోతోంది. కేవలం 56.2 శాతం మంది మాత్రమే 12వ తరగతి పూర్తి చేసుకోగలుగుతున్నారు. అంతేకాకుండా కేవలం మూడోవంతు మంది కాలేజీ విద్యలో చేరుతున్నారు. కాలేజీల్లో చేరే వారిలో బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువే. దీనికి ప్రధాన కారణం ఆర్థిక వెనుకబాటుతనం.

### విప్రో సామాజిక బాధ్యత

విప్రో కంపెనీ సామాజిక బాధ్యత కింద భారీ ఎత్తున అనేక కార్యక్రమాలు చేపడుతోంది. విప్రో వార్షిక నివేదిక 2023-24 ప్రకారం.. 2023-24లో ఆ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల కోసం రూ.17,900 కోట్లకుపైగా వెచ్చించింది. దీనిద్వారా విద్య, వైద్యం, డిజిటల్ స్కిల్లింగ్ వంటి అంశాల్లో 17 దేశాల్లోని 45 లక్షల మందికి లబ్ధి చేకూరింది. 2020-21 నుంచి 2023-24 వరకు.. మనదేశంలో విద్యా రంగంలో 29 లక్షల మంది లబ్ధి పొందారు. ఇదే సమయంలో.. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విభాగంలో 38 లక్షల మందికి ప్రయోజనం చేకూరింది.

## కీలెరిగి వాతపెట్టిన 'సుప్రీం'



యుద్ధంలో ఆయుధాలు మాత్రమే నిర్ణయాత్మక శక్తి కాదు... కోట్లాది పౌరులు ఒక్కటై వినిపించే స్వరం కూడా. కానీ పాకిస్తాన్‌తో తీవ్ర ఘర్షణలు తలెత్తిన వేళ ఆ సమష్టి స్వరానికి అవరోధం కల్పించేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి మన నేతల్లో కొందరు దేశాన్ని దిగ్భ్రమ పరిచారు. బహుశా అందుకే కావొచ్చు, కల్నల్ సోఫియా ఖురేషిపై నోరు పారేసుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కన్వర్ విజయ్ షా క్షమాపణను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. ఈ విషయంలో ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి ఈ నెల 28కల్లా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఐపీఎస్ అధికారులతో ఏర్పాటయ్యే ఈ బృందంలో ఒక మహిళా అధికారి ఉండాలనీ, దానికి ఐజీ ర్యాంకుకు తక్కువకాని అధికారి సారథ్యం వహించాలనీ ఉత్తర్వులిచ్చింది. ఈ తరహా విద్వేష ప్రసంగాలు బీజేపీ నేతల నుంచి మాత్రమే కాదు, కొందరు విపక్ష నేతల నుంచీ వినిపించాయి. చిత్రమేమంటే ఎక్కడా, ఎవరిపైనా పోలీసులు కేసులు పెట్ట లేదు, చర్యలకు సిద్ధపడలేదు. కానీ సాధారణ పౌరులు చిన్నపాటి భిన్నస్వరం వినిపించినా విరు చుకుపడ్డారు. ఇందుకు అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ ఉదంతమే నిదర్శనం. కల్నల్ సోఫియాను కీర్తిస్తున్న బీజేపీ శ్రేణులు విద్వేష ప్రచారానికి బలవుతున్నవారిని ఎందుకు పట్టించుకో రని ఆయన ప్రశ్నించారు. సైన్యాన్నిగానీ, ఆ మహిళా అధికారుల్నిగానీ కించపరచలేదని, బాహాటంగా కనిపిస్తున్న ద్వంద్వ నీతిని ఎత్తిచూపటమే తన ఉద్దేశమని చెప్పినా ఆయన్ను అరెస్టు చేశారు. విజయ్ షాపై మధ్యప్రదేశ్ పోలీసులు సొంతంగా కేసు నమోదు చేయలేదు. అక్కడి హైకోర్టు సుమోటోగా తీసుకుని తక్షణం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని పోలీసుల్ని ఆదేశించింది. ఆ తర్వాతైనా పోలీసులు సక్రమంగా చర్యలు తీసుకున్నది లేదు. ఎఫ్ఐఆర్ వాలకం గమనించిన హైకోర్టు చీవాట్లు పెట్టాకే వారికి జ్ఞానోదయమైంది. విజయ్ షా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదు. రాష్ట్రంలోని ఎస్టీ నియోజకవర్గం హర్సూద్ నుంచి ఇప్పటికి 8 దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు. మంత్రిగా పని చేస్తున్నారు. సంక్షోభ సమయాల్లో సంయమనం పాటించటం చాలా అవసరం. బాధ్యతాయుత స్థానాల్లో వున్నవారు ఆ సంగతి మరిచిపోతున్నారు. విజయ్ షా వ్యాఖ్యల సంగతే తీసుకుంటే ఆయన అన్నది కేవలం కల్నల్ సోఫియా ఖురేషిని మాత్రమే కాదు... ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావన చేసి ఆయనపై సంశయాలు రేకెత్తించే విధంగా మాట్లాడారు. యుద్ధానికి సంబంధించిన వివరాలను వెల్లడించటానికి నియమించిన ఇద్దరు మహిళా ప్రతినిధుల్లో ఒకరైన కల్నల్ సోఫియాను 'ఉగ్ర వాదుల సోదరి'గా అభివర్ణించారు. ఉగ్రవాదులను ఆ వర్గం చేతే దెబ్బకొట్టించటానికి ప్రధాని ఆమెను తెలివిగా ఎంపిక చేశారన్నట్టు మాట్లాడారు. కల్నల్ సోఫియా నిర్వహించిన మీడియా సమావేశాలను గమనిస్తేనే ఆమె ఎంత సమర్థంగా, చతురతతో ఆ బాధ్యతను నెరవేర్చారో తెలు స్తుంది. గర్వించదగిన నేపథ్యం ఆమెది. దేశంలోని ప్రతి మహిళా స్ఫూర్తిదాయకంగా తీసుకోదగిన చరిత్ర ఆమెది. సైనిక కుటుంబం నుంచి వచ్చి, సైన్యంలో చేరి అందులోని వ్యక్తినే వివాహమాడి ప్రతి స్థాయిలోనూ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ కల్నల్ హోదా వరకూ ఎదిగారు. అటువంటామెను కేవలం ముస్లిం మహిళగా చూశారంటేనే...

విజయ్ షా ఎంత ఉన్మాదపూరితంగా ఆలోచి స్తున్నారో అర్థమవుతోంది. అందుకే ఆయన ప్రసంగం తీరు చూసి దేశం యావత్తూ సిగ్గుపడుతోందని సుప్రీంకోర్టు అనక తప్పలేదు. ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ దేశమంతా ఒక్కటై ఈ కష్టకాలాన్ని అధిగమించటానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. దాని అర్థం, పర మార్థం విజయ్ షాకు కాస్తయినా అర్థం కాలేదని ఆయన చేసిన వ్యాఖ్యలు, అటు తర్వాత క్షమా పణ చెబుతూ చేసిన ప్రకటన గమనిస్తే తెలుస్తుంది. నోరుజారి తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నానంటే బహుశా కోర్టు చీవాట్లతో సరిపెట్టేదేమో! కానీ అందరి నేతల మాదిరే 'ఎవరి మనోభావాలైనా దెబ్బతినివుంటే...' అంటూ రాగం తీయడంతో వివాదంలో మరింత కూరుకుపోయారు. మంత్రి చెప్పిన క్షమాపణలో చిత్తశుద్ధి లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చేస్తున్నది క్షమించరాని తప్పని ఎటూ తెలియలేదు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు పార్టీ అధిష్ఠానం సైతం మందలించినా పునరాలోచన కలగలేదు, పరివర్తన రాలేదు. ఇలాంటివారిని నాలుగ్గోడల మధ్య మందలించటం కాదు... పదవి నుంచి సాగనంపివుంటే అలాంటివారికి అదొక హెచ్చరికగా ఉండేది. దేశ ప్రజలు కొనియాడేవారు. కానీ బీజేపీ ఆ పని చేయలేకపోయింది. సమాజ్‌వాదీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ సైతం ఈ మాదిరి వ్యాఖ్యలే చేశారు. వైమానిక దళ అధికారులైన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, ఎయిర్ మార్షల్ ఏకే భారతిల కులాల ప్రస్తావన చేశారు. బీజేపీకి కల్నల్ సోఫియా మతం తెలిసిందిగానీ ఈ అధికారులిద్దరూ పీడిత కులాలవారని తెలియదని, లేకుంటే వారిపైనా తప్పుడు వ్యాఖ్యనాలు చేసేవారని అన్నారు. ఈ బాపతు నాయకు లంతా మనుషుల్ని ఎంతసేపూ కులమతాల చట్రాల్లో చూస్తూ వారి సేవలనూ, అంకిత భావాన్నీ, సంకల్ప దీక్షనూ మరుగుపరుస్తారు. దేశభక్తి పేరుతో ఉన్మాదాన్నీ, విద్వేషాన్నీ పెంచి పోషిస్తారు. సుప్రీంకోర్టు స్పందించిన తీరు నేతలందరికీ గుణపాఠం కావాలి. సంక్షోభ కాలాల్లో మాత్రమే కాదు... సాధారణ సమయాల్లోనూ జాగ్రత్తగా మాట్లాడాలని తెలుసుకోవాలి.

# నా రక్తం పతనం కోరుకుంటే.. ప్రభాస్ మాత్రం..



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' సినిమా జూన్ 27 విడుదల కానున్న విషయం తెలిసిందే. మహేశ్వరుడి భక్తుడు కన్నప్ప జీవిత ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా విష్ణు కెరీర్ లోనే బిగ్గెస్ట్ మూవీ. 100 కోట్ల బడ్జెట్ తో పాన్ ఇండియా క్రేజ్ కు తగ్గట్టుగా సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇక సినిమాకు పాజిటివ్ హైప్ వచ్చేలా ప్రస్తుతం విష్ణు అమెరికాలో ఉంటూ, అభిమానులతో సమావేశాలు, ఇంటర్వ్యూల ద్వారా సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాలో ప్రధానంగా స్టార్ క్యాస్ట్ హైప్ క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నందీశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నాడు. ఇక అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ కాస్ట్ కీలక పాత్రల్లో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్‌లో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, AVA ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై ఈ సినిమా రూపొందుతోంది.విష్ణు కోసం గతంలో ప్రభాస్‌తో 'ఢేనికైనా రెడీ' సినిమాలో సర్ ప్రైజ్ ఇచ్చాడు. ఒక ఫోన్ కాల్ సీన్ కోసం డబ్బింగ్ చెప్పాడు. ఇక తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో విష్ణు, ప్రభాస్‌తో తన సన్నిహిత సంబంధం గురించి మరింత ఎమోషనల్ గా వివరణ ఇచ్చారు. విష్ణు మాట్లాడుతూ.. ప్రభాస్‌తో నాకు చాలా మంచి స్నేహ బంధం ఉంది, స్నేహపూర్వకంగా ఆయన్ని తిడతాను కూడా. ప్రభాస్ తను ఎంత పెద్ద స్టారో గుర్తించడు, ఎవరి గురించి పట్టించుకోడు, తన ప్రపంచంలో సంతోషంగా ఉంటాడు. కెరీర్ మొదటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేదు" అని విష్ణు అన్నాడు. అలాగే ప్రభాస్ సింప్లిసిటీ గురించి విష్ణు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ప్రభాస్‌కు నీవు ఎప్పటికీ మారకూడదని చెప్పాను, దానికి ఆయన నవ్వుతూ 'మారడానికి ఏం ఉంది, నేను ఎప్పుడూ ఇలాగే ఉంటాను కదా' అని అన్నాడు. అతనిలా జీవించడం చాలా అరుదు" అని విష్ణు పేర్కొన్నాడు. ప్రభాస్ ఆసియాలోనే అతిపెద్ద స్టార్‌లలో ఒకడిగా ఎదిగినప్పటికీ, అతని సింప్లిసిటీ అభిమానులను ఆకర్షిస్తుందని విష్ణు చెప్పాడు. తన కుటుంబంలో ఎదురవుతున్న సమస్యల గురించి కూడా విష్ణు భావోద్వేగంగా మాట్లాడాడు. "రక్తం పంచుకొని పుట్టిన వారే నా పతనం కోరుకుంటే.. ప్రభాస్ మాత్రం నేను సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాడు. మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి కలిస్తే, మన స్నేహం ఎప్పటికీ ఉంటుందని, మనం భిన్నమైన జీవన శైలి నుంచి వచ్చామని ఆయన అన్నాడు" అని విష్ణు తన వివరణను వ్యక్తం చేశాడు. ఇక 'కన్నప్ప' సినిమా శివ భక్తుడైన కన్నప్ప కథ ఆధారంగా రూపొందుతోంది. ఈ సినిమాలో ప్రభాస్ నంది పాత్రలో, అక్షయ్ కుమార్ శివుడిగా, కాజల్ అగర్వాల్ పార్వతిగా కనిపించనున్నారు. మోహన్‌లాల్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు ప్రశాంత్ నీల్ బ్యాడ్ న్యూస్!



స్టార్ హీరో పుట్టిన రోజు వస్తోందంటే అభిమానులు చేసే హడావిడి, నిర్మాణ సంస్థలు చేసే హంగామా అంతా ఇంతా కాదు. చేస్తున్న సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్ లేదా గ్లింప్స్, టీజర్ లాంటివి విడుదల చేస్తూ అభిమానుల్ని సంతోషపరుస్తుంటారు. సినిమాకు వాళ్లలో ఉన్న హైప్‌ని మరింతగా పెంచి క్రేజ్‌ని తారా స్థాయికి తీసుకెళుతుంటారు. ఇదే తరహాలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమా అప్ డేట్స్ కోసం అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 20న భారీ స్థాయిలో జరగనున్నవిషయం తెలిసిందే. ఇదే ఏడాది ఎన్టీఆర్ భారీ పాన్ ఇండియా మూవీ %-%వార్ 2%-%తో బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. యష్‌రాజ్ ఫిలింస్ పస్పై యూనివర్స్‌లో భాగంగా అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే బారీ అంచనాలు ఏర్పడ్డాయి. హృతిక్ రోషన్, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తుండగా ఎన్టీఆర్ ఇందులో రా ఏజెంట్‌గా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్టుగా తెలుస్తోంది. ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ లేదా గ్లింప్స్ టీజర్‌లు ఎప్పుడెప్పుడు విడుదలవుతాయా అని అభిమానులు, సినీ లవర్స్ గత కొన్ని రోజులుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. వారి ఎదురుచూపులకు తెరదించుతూ - వార్ 2 - టీమ్ ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా టీజర్‌ని రిలీజ్ చేయబోతోంది. ఇప్పటికే హృతిక్ రోషన్ ఈ సర్‌ప్రైజ్ గిఫ్ట్‌పై హింట్ ఇస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్‌ని షేర్ చేయడం, దానికి ఎన్టీఆర్ అంతే చమత్కారంగా రిప్లై ఇవ్వడం తెలిసిందే. శనివారం - వార్ 2 - మేకర్స్ కూడా - ఈ పుట్టిన రోజును %-%వార్ 2 - తో సెలబ్రేట్ చేసుకోండి%-% అంటూ ఎన్టీఆర్ అభిమానులకు క్లారిటీ ఇచ్చేసింది. అయితే ప్రశాంత్ నీల్ మాత్రం ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్ చెప్పేశాడు. ఈ మూవీతో పాటు ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న %-%డ్రాగన్%-%లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. సెట్‌లోకి ఎన్టీఆర్ కూడా ఎంటరయ్యాడు. అయితే ఎన్టీఆర్ పుట్టిన రోజున ఈ సినిమా నుంచి కూడా సర్ ప్రైజింగ్ అప్ డేట్ వస్తుందని, గ్లింప్స్‌ని రిలీజ్ చేస్తారని అంతా ఆశపడ్డారు. కానీ ఆ ఆశలపై నీళ్లు చల్లిన ప్రశాంత్ నీల్ టీమ్ తాజాగా ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్ చెప్పింది. గ్లింప్స్‌ను ఇప్పుడు రిలీజ్ చేయడం లేదని, మరో తేదీకి వాయిదా వేశామని వెల్లడించింది. దీంతో ఎన్టీఆర్ అభిమానులు ఫీలవుతున్నారు. ఆశ పెటర్టి ప్రశాంత్ నీల్ ఇలా బాంబ్ పేల్చాడేంటని వాపోతున్నారు.

# Cinema

# చార్మీ.. చాలా రోజుల తరువాత ఇలా..



టాలీవుడ్‌లో ఒకప్పుడు గ్లామరస్ హీరోయిన్‌గా వెలుగొందిన చార్మీ కౌర్, చాలా రోజుల తర్వాత తన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన 38వ పుట్టిన రోజు సందర్భంగా ఆమె ఈ ఫోటోను అప్‌లోడ్ చేసింది. చార్మీ ఈ ఫోటోలో ఎప్పటిలాగే అందంగా, ఎనర్జిటిక్‌గా కని పించింది, ఆమె స్టైల్ అందరినీ ఆకర్షించింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభి మానుల నుంచి శుభా కాంక్షలు వెల్లు వెత్తు తు న్నాయి. అను కోకుండా ఒక రోజు', 'లక్ష్మి' సినిమాలతో ఒకప్పుడు హీరోయిన్‌గా టాలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించిన చార్మీ, 2015 తర్వాత నటనకు దూరమైంది. ఆమె నిర్మాతగా మారి, పూరి జగన్నాథ్‌తో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పలు సినిమాలను నిర్మించింది. నిర్మాతగా ఆమె విజయవంతమైన ప్రయాణం సాగుతున్నప్పటికీ, ఆమె నటనను మిస్ అవుతున్నామని అభిమానులు అంటు న్నారు. చార్మీ చివరిసారిగా 2015లో 'మంత్ర 2' సినిమాతో నటిగా కనిపించింది. ఆ తర్వాత నటనకు పూర్తిగా దూరమై, నిర్మాణంపై దృష్టి సారించింది. అయితే, ఆమెకు ఇప్పటికీ నటనకు సంబంధించిన అవకాశాలు వస్తున్నాయని, కానీ ఆమె వాటిని సున్నితంగా తిరస్కరిస్తోందని సమాచారం. నిర్మాతగా ఆమె బిజీ షెడ్యూల్, కొత్త కథలపై ఫోకస్ ఆమెను నటనకు దూరంగా ఉంచుతున్నాయని టాక్. ఈ సందర్భంగా చార్మీ పుట్టినరోజు ఫోటో అభిమా నులకు సర్‌ప్రైజ్‌గా నిలిచింది. ఆమె ఈ ఫోటో లో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో అద్భుతంగా కనిపించింది, ఆమె అందం, స్టైల్ అందరినీ ఆకట్టు కుంది. "చార్మీ ఎప్పటిలాగే అద్భుతంగా ఉంది, మళ్లీ నటించాలని కోరు కుంటున్నాం" అని అభిమానులు కామెంట్స్ చేసున్నారు. ఈ ఫోటో ఆమె పుట్టినరోజు సంద ర్భంగా అభిమానులకు ఓ చిన్న ట్రీట్‌గా నిలిచింది. చార్మీ నిర్మాతగా తన దృష్టిని కొన సాగిస్తున్నప్పటికీ, ఆమె నటనకు తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆమె ఎనర్జిటిక్ పర్ఫామెన్స్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ ఇప్పటికీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. ఆమె త్వరలో నటనలోకి రీఎంట్రీ ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక నెక్స్ట్ నిర్మాతగా ఆమె విజయ్ సేతుపతి పూరి కాంబినేషన్ కోసం సిద్ధం అవుతున్నారు.

# పవన్ కెరీర్ లో ఈ గ్యాప్ మచ్చలా మిగలదుగా!



# అనసూయ..
# నడముతో వయ్యారాల సెగ



అనసూయ భరద్వాజ్.. ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కూడా తనదైన గ్లామర్ తో సరికొత్తగా కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో నాన్ స్టాప్ గా వైరల్ అవుతున్నాయి. పింక్ కలర్, మల్టీ కలర్ లెహంగా–చోళీ ధరించి అనసూయ చేసిన ఈ ఫొటో షూట్ ఫ్యాన్స్‌ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. బోల్డ్ అటిట్యూడ్, క్యూట్ ఫేస్ ఎక్స్ప్రెషన్స్ అంతా కలసి ఈ ఫోటోలు స్పెషల్ గా నిలుస్తున్నాయి. రంగురంగుల దుస్తులు, పర్ఫెక్ట్ స్టైలింగ్ తో అనసూయ ఈ సారి మరీ అందంగా కనిపిస్తోంది. ఈ ఫోటోల్లో అనసూయ వేసిన మల్టీ కలర్ లెహంగా దుస్తులు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. పైన వేసిన చోళీ పైన చిన్న చిన్న అద్దాలు, కట్లు వేస్తూ డిజైన్ చేసిన పద్ధతి, చీరని ఎగుర వేసిన ఫోటో పాజ్ అంతా చూసేవారికి ఒక కళాత్మక దృశ్యం లా కనిపిస్తోంది. ఈ లుక్‌లో అనసూయ స్టైల్, కాన్ఫిడెన్స్ రెండూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ ఫోటోలు చూసి కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. 'అనసూయ గారూ.. మీరు వెన్నెలకంటే అందంగా ఉన్నారు', 'ఒక్క చూపుతో గుండెల్లో తుఫాను' అంటూ ఫ్యాన్స్ రియాక్షన్లు వెల్లువెత్తుతున్నాయి. అనసూయ ఈ మధ్యకాలంలో తన లుక్‌లతో, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో ఎక్కువగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే, యాంకరింగ్ నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'జబర్దస్త్' షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ, ఆ తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి బిగ్ స్క్రీన్ ప్రాజెక్ట్‌లలో తన నటనతో కితాబు అందుకుంది. పుష్ప సినిమాలోని దాక్షాయిణి పాత్ర అయితే ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తాజాగా అనసూయ వెబ్ సిరీస్‌లలోనూ బిజీ అవుతోంది. అలాగే అనసూయ మరికొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. అలాగే ఒక నటిగా మాత్రమే కాకుండా యాంకర్, మోడల్, వెబ్ సిరీస్ ఆర్టిస్ట్ ఇలా విభిన్న వేదికల్లో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తోంది.

